ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శనివారం 30 మార్చి 2024



ఇక యుద్ధమే..

- రాజంపేట పార్లమెంటు పరిధిలో.. ఖరారైన ప్రధాన పార్టీల అభ్యర్థులు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): మరో 40 రోజుల్లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల కోసం.. రాజంపేట పార్లమెంటు పరిధిలో ఏడు అసెంబ్లీ స్థానాలు, పార్లమెంటు స్థానానికి తెలుగుదేశం, వైఎస్సార్ కాంగ్రెస్, జనసేన, బీజేపీ తరపున అభ్యర్థులు ఎవరో తేలిపోయింది. దీంతో ప్రధాన పార్టీలు ఇప్పుడు ప్రచారం మీద ప్రత్యేక దృష్టి సారించాయి. ఈ నేపథ్యంలో.. రాజంపేట పార్లమెంటు పరిధిలో ప్రధాన పార్టీల అభ్యర్థులతో బరి సిద్ధమైందని, ఇక రసవత్తరంగా సాగే యుద్ధమే మిగిలిందని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

రాజంపేట పార్లమెంటు పరిధిలో తొలి విడతలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థులను ఖరారు చేసింది. తొలుత మదనపల్లె స్థానానికి సిట్టింగ్ ఎమ్మెల్యే నవాజ్‌బాషాను మార్చింది. ఆ స్థానంలో నిస్సార్ అహ్మద్‌ను ప్రకటించింది. రాజంపేట సిట్టింగ్ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డిని మార్చి.. కడప జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్ నాథ్‌రెడ్డికి టికెట్టు ఇచ్చింది. ఐదో విడతలో జిల్లాలో మిగిలిన స్థానాల అభ్యర్థులను వైసీపీ అధిష్టానం ప్రకటించింది. తంబళ్లపల్లె పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, పీలేరు చింతల రామ చంద్రారెడ్డి, పుంగనూరు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాయచోటి గడికోట శ్రీకాంత్‌రెడ్డి, రైల్వేకోడూరు కొరముట్ల శ్రీనివాసులును అభ్యర్థులుగా ప్రకటించింది. అదే విధంగా తెలు గుదేశం పార్టీ తొలి విడతలో జిల్లాలో తంబళ్లపల్లెకు దాసరిపల్లె జయచంద్రారెడ్డి, పీలేరు నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి, రాయచోటి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డిలకు టికెట్లను ఖరారు చేస్తూ చంద్రబాబు ప్రకటించారు. రెండో విడతలో మదనపల్లెకు షాజహాన్‌బాష, పుంగ నూరుకు చల్లా రామచంద్రారెడ్డి (బాబు)లను ఖరారు చేశారు. రైల్వేకోడూరుకు జనసేన అభ్యర్థిగా డాక్టర్ భాస్కర్‌రావును ప్రకటించింది. ఇక మిగిలిన రాజంపేటకు నాల్గవ విడ తలో టీడీపీ సుగవాసి బాలసుబ్రమణ్యంకు టికెట్టును ప్రకటించింది.

రాజంపేట పార్లమెంటు స్థానానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సిట్టింగ్ ఎంపీ మిధున్‌రెడ్డికే అవకాశం ఇచ్చింది. ఈ స్థానంలో తెలుగుదేశం పార్టీ తమ అభ్యర్థిగా సుగ వాసి బాలసుబ్రమణ్యంను తెర మీదకు తెచ్చింది. అయితే తెలుగుదేశం, జనసేన, బీజేపీ పొత్తులో భాగంగా.. ఈ సీటును బీజేపీ నేత మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డికి కేటాయించారు. దీంతో ప్రస్తుతం రాజంపేట పార్లమెంటు పరిధిలో అన్ని స్థానాలకూ.. పార్టీలు తమ అభ్యర్థులను ఖరారు చేసేశాయి. ఇక ఎన్నికల పోరు మాత్రమే మిగిలి ఉంది.

సరిహద్దు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా

- జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

బి.కొత్తకోట, మార్చి 29: జిల్లాలోని కర్ణాటక సరిహద్దు మండలాలైన కొత్తకోట, పీటీయం మండలాల పరిధిలో ప్రత్యేక నిఘా పెడతామని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్‌అహ్మద్ ఖాన్ పేర్కొన్నారు. శుక్రవారం బి.కొత్తకోట మండల సరిహద్దు బెంగళూరు రోడ్డులో వున్న రాణా మిట్ట చెక్‌పోస్టును ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సాధారణ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో కర్ణాటక నుంచి నగదు, మద్యం ఓటర్లకు పంచే తాయిలాలు పీటీయం, బి.కొత్తకోట మండలాల మీదుగా రాష్ట్రంలోకి తరలించే అవకాశం ఉందన్నారు. దీనిపై అయా సరిహద్దులలో చెక్‌పోస్టుల ఏర్పాటుతో పాటు, ప్రత్యేక బృందాలు గస్తీ, సీసీ కెమెరాల ద్వారా గట్టి నిఘా ఉంచామన్నారు. సరిహద్దు గ్రామాలలో ఎక్కడైనా రాజకీయపార్టీ నాయకులు స్టాక్‌పాయింట్లు పెట్టే అవకాశం వుందని, అలాంటి వారిపై గట్టి నిఘా పెట్టాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని, ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే తగిన చర్యలు తీసుకుం టామని జేసీ హెచ్చరించారు. చెక్‌పోస్టులో సిబ్బంది పనితీరును, వాహనాల తనిఖీ విధానాన్ని పరిశీలించారు. జేసీ వెంట తంబళ్లపల్లె నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి రాఘవేంద్ర, తహ శీల్దార్ పుణ్యవతి, సీఐ సూర్యనారాయణ, ఆర్‌ఐలు బాలాజీ, అనీషా, వీఆర్వో నరేంద్రబాబు తదితరులు ఉన్నారు.


రాణామిట్ట చెక్‌పోస్టు వద్ద పరిశీలిస్తున్న జేసీ ఫర్మాన్‌అహ్మద్ ఖాన్

రాజంపేట బరిలో బాలసుబ్రమణ్యం

- ప్రకటించిన చంద్రబాబు నాయుడు
- పుష్కర కాలం తర్వాత ప్రత్యక్ష రాజకీయాల్లోకి సుగవాసి కుటుంబం



సుగవాసి బాలసుబ్రమణ్యం

తల్లి	: శమంతకమణి
తండ్రి	: పాలకొండ్రాయుడు
పుట్టిన తేదీ	: 03/08/1970
చదువు	: ఎంటెక్,(కోయంబత్తూరు)

రాజకీయ ప్రవేశం

- 1995లో రాయచోటి జడ్పీటీసీ సభ్యుడిగా గెలుపు.
- ఉమ్మడి కడప జిల్లా జడ్పీ వైస్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు
- చివరి రెండు నెలలు జడ్పీ చైర్మన్‌గా బాధ్యతలు
- 2001లో మరోసారి రాయచోటి జడ్పీటీసీ సభ్యుడిగా గెలుపు
- 2012లో టీడీపీ తరపున ఉప ఎన్నికల్లో రాయచోటి అసెంబ్లీ స్థానానికి పోటీ చేసి ఓటమి

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): రాజంపేట అసెంబ్లీ స్థానం టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే సుగ వాసి పాలకొండ్రాయుడు పెద్ద కొడుకు, ఉమ్మడి కడప జిల్లా పరిషత్ మాజీచైర్మన్ సుగవాసి బాలసుబ్రమణ్యం ను తెలుగుదేశం పార్టీ ప్రకటించింది. శుక్రవారం ప్రక టించిన నాల్గవ విడతలో బాలసుబ్రమణ్యం పేరును ప్రకటించారు. దీంతో స్థానికంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బాలసుబ్రమణ్యంను కలిసి అభినందనలు తెలియజేశారు. తొలుత రాజంపేట పార్ల మెంటు స్థానానికి బాలసుబ్రమణ్యం పేరును ఖరారు చేస్తున్నట్లు చంద్రబాబు అనధికారికంగా తెలియజేశా రు. దీంతో గత రెండు నెలల కాలంగా బాలసుబ్రమ ణ్యం రాజంపేట పార్లమెంటు పరిధిలో టీడీపీ నాయకు లు, కార్యకర్త లను కలుస్తూ వచ్చారు. అయితే అనూ హ్యంగా టీడీపీ, బీజేపీ, జనసేన పొత్తులో భాగంగా ఈ స్థానాన్ని భారతీయ జనతా పార్టీకి కేటాయించారు. ఇక్క డి నుంచి మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి పోటీ చేస్తున్నాడు. దీంతో ఒక్కసారిగా సుగవాసి అభిమాను ల్లో అలజడి రేగింది. బాలసుబ్రమణ్యంకు ఎక్కడ టికెట్ ఇస్తారు.. అనే చర్చ నియోజకవర్గ వ్యాప్తంగా జరిగింది. ఈ నే పథ్యంలో శుక్రవారం ప్రటించిన జాబితాలో రాజంపేట అసెంబ్లీ స్థానం అభ్యర్థిగా సుబ్రమణ్యం పేరును ఖరారు చేశారు.

రాజంపేట అసెంబ్లీ టికెట్టును పలువురు ఆశించారు. అయితే జిల్లా వ్యాప్తంగా అనేక రాజకీయ సమీకరణల నేపథ్యంలో బాలసుబ్రమణ్యంకు టికెట్టు దక్కింది. దీంతో సుగవాసి కుటుంబానికి పుష్కర కాలం తర్వాత ప్రత్యక్ష ఎన్నికల బరిలో నిలిచే అవకాశం దక్కింది. 2012లో కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనతో పాటు.. 18 మందితో రాజీనామాలు చేయించారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఆ స్థానా లకు ఉప ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో బాలసుబ్ర మణ్యం తెలుగుదేశం పార్టీ తరపున రాయ చోటి అసెంబ్లీ స్థానానికి పోటీ చేసి ఓడిపో యారు. ఇక ఆ తర్వాత సుగవాసి కుటుంబానికి ఎన్నికల బరిలో నిలిచే అవకాశం రాలేదు. 2014, 2019 ఎన్నికల్లో రాయచోటి నియోజకవర్గ టీడీపీ టికెట్టు కోసం పాలకొండ్రాయుడు కుటుంబం ప్రయత్నిం చింది. సుగవాసి పాలకొండ్రాయుడు ఒక సారి రాజం పేట ఎంపీగా, నాలుగుసార్లు రాయచోటి ఎమ్మెల్యేగా గెలుపొందారు. రాయచోటి నియోజకవర్గంలో ఈ కు టుంబానికి గట్టి పట్టుంది. ఈసారి ఈ స్థానాన్ని మండి పల్లె రాంప్రసాద్‌రెడ్డికి టీడీపీ టికెట్టును కేటాయించింది. ఈ నేపథ్యంలో బాలసుబ్రమణ్యంకు రాజంపేట అసెంబ్లీ స్థానానికి పోటీ చేసే అవకాశాన్ని చంద్రబాబు కల్పించారు. దీంతో స్థానికంగా ఉన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బాలసుబ్రమణ్యంను కలిసి అభినందనలు తెలిపారు.



పార్లమెంటు బరిలో భూపేశ్‌రెడ్డి

- కడప పార్లమెంటు టీడీపీ అభ్యర్థిగా ఐవీఆర్‌ఎస్ సర్వే
- జనం నుంచి ఫీడ్‌బ్యాక్
- ఎంపీ అభ్యర్థిగా భూపేశ్‌రెడ్డిని ప్రకటించిన చంద్రబాబు
- టీడీపీలో నయా జోష్

(కడప-ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ సొంత జిల్లాలో ఈసారి వైసీపీ జోరుకు కళ్లెం వేసేందుకు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఆచితూచి అడుగులు వేశారు. 1994 ఎన్నికల్లో అప్పటి ఉమ్మడి కడప జిల్లా టీడీపీకి కంచుకోటలా ఉండేది. తరువాత పరిస్థితులు, నాయకత్వ లోపం కారణంగా పూలు అమ్ముకున్న చోట కట్టెలమ్ముకునే పరిస్థితి వచ్చింది. ఈ సారి ఎన్నికల్లో సొంత అడ్డాలోనే జగన్‌ను నిలువరించేందుకు చంద్రబాబునాయుడు అందుబాటులో ఉన్న అస్త్రాలన్నీ వాడుకుంటున్నారు. పులివెందులలో జగన్‌కు ధీటుగా మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవిని రంగంలోకి దింపారు. వివేకా హత్య, పులివెందులలో అక్రమాలు, అవినీతి, వైసీపీ నేతల కబ్జాలపై బీటెక్ రవి సంధిస్తున్న ప్రశ్నలు జనాల్లోకి దూసుకెళుతున్నాయి.

ఇక కడప సిట్టింగ్ ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డిపై టీడీపీ యువనేత భూపేశ్‌రెడ్డిని రంగంలోకి దింపింది. ఫ్యాక్షన్ గడ్డ జమ్మలమడుగు ప్రాంతానికి చెందిన మాజీ ఎమ్మెల్సీ చదిపిరాళ్ల నారాయణరెడ్డి కుమారుడే భూపేశ్‌రెడ్డి. బీఏ ఎల్‌ఎల్‌బీ పూర్తిచేసిన ఈయన 2014లో మైలవరం జడ్పీటీసీ సభ్యుడిగా రాజకీయరంగ ప్రవేశం చేశారు. 2019కి ముందు జమ్మలమడుగు నుంచి భూపేశ్‌రెడ్డి చిన్నాన్న ఆదినారాయణరెడ్డి ప్రాతినిధ్యం వహించేవారు. ఆయన టీడీపీలో మంత్రిగా పనిచేశారు.

రెండున్నరేళ్లుగా ఇంటింటికీ..

2019 ఎన్నికల్లో కడప పార్లమెంటు అభ్యర్థిగా ఆదినారాయణరెడ్డి పోటీ చేసి ఓడిపోయారు. జగన్ సీఎం అయిన తరువాత తన రాజకీయ ప్రత్యర్థులను జైల్లో ఇబ్బందులు పెట్టే కార్యక్రమానికి తెరలేపారు. దీంతో ఆదినారాయణరెడ్డి బీజేపీలో చేరిపోయారు. టీడీపీ అధిష్టానం భూపేశ్‌రెడ్డికి జమ్మలమడుగు ఇన్‌చార్జి అప్పగించింది. దాదాపు రెండున్నర సంవత్సరాలపాటు ఆయన , తన తండ్రి నారాయణరెడ్డి, చిన్నాన్న శివనాథరెడ్డి, ఇతర కుటుంబ సభ్యులుతో కలసి జమ్మలమడుగులో ప్రతి ఇంటి తలుపు తట్టారు.

స్టీలు ఫ్యాక్టరీ పూర్తి చేస్తా..

టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, నారా లోకేశ్, అచ్చెన్నాయుడు నాపై ఎంతో నమ్మకంతో కడప పార్లమెంటు అభ్యర్థిగా ఎంపిక చేశారు. 2019లో చంద్రబాబు హయాంలోనే జిల్లాలో స్టీలు ఫ్యాక్టరీ నిర్మాణానికి అడుగులు పడ్డాయి. జగన్ సీఎం అయిన తరువాత శంకుస్థాపనలు తప్ప ఫ్యాక్టరీ గురించి పట్టించుకోలేదు. ఈ ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కలిసి పోటీ చేస్తున్నాయి. కేంద్రంలో వచ్చేది ఎన్డీఏ ప్రభుత్వమే. నేను ఎంపీగా గెలిస్తే కడప జిల్లా యువత చిరకాల వాంఛ అయిన స్టీలు ఫ్యాక్టరీని పూర్తిచేసి నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి కల్పిస్తాం.

- భూపేశ్‌రెడ్డి, టీడీపీ కడప ఎంపీ అభ్యర్థి

చంద్రబాబు సీఎం అయితే జరిగే లబ్ధిని ప్రతి కుటుంబానికి వివరించారు.

కలిసివచ్చిన యువగళం సక్సెస్..

గత ఏడాది నారాలోకేశ్ జిల్లాలో నిర్వహించిన యువగళం పాదయాత్ర తొలి అడుగు జమ్మలమడుగు నియోజకవర్గంలో పడింది.. కడప జిల్లాలో తొలి సభను భూపేశ్‌రెడ్డి సూపర్‌సక్సెస్ చేశారు. దీంతో లోకేశ్ అండ్ టీం కూడా ఆ సభపై సంతోషం వ్యక్తం చేశారు. తరవాత భూపేశ్‌రెడ్డి పార్టీ ఆదేశాలను పాటిస్తూ నిత్యం జనాల్లో ఉండేవారు. అయితే పొత్తులో భాగంగా జమ్మలమడుగును బీజేపీకి కేటాయించడంపై టీడీపీ వర్గీయులు జీర్ణించుకోలేక పోయారు. భూపేశ్‌రెడ్డి ఇన్నాళ్లు కష్టపడితే ఇప్పుడు బీజేపీకి కేటాయిస్తారా అని మండిపడుతూ వచ్చారు. అయితే జమ్మలమడుగు అసెంబ్లీ నియోజకవర్గంకాదు.. ఇప్పుడు ఏకంగా కడప పార్లమెంటుకే అభ్యర్థిగా భూపేశ్‌రెడ్డిని ప్రకటించడంతో టీడీపీ శ్రేణుల్లో జోష్ నెలకొంది. ముఖ్యంగా భూపేశ్‌రెడ్డి యువకుడు. అందరినీ కలుపుకుని పోయే మనస్తత్వం ఉంది. ఐవీఆర్‌ఎస్ సర్వేలో కూడా భూపేశ్‌రెడ్డికే అనుకూలంగా వచ్చింది. రెండుసార్లు వైసీపీ నుంచి ఎంపీగా గెలిచిన వైఎస్ అవినాశ్‌రెడ్డితో ఢీకొనబోతున్నారు. ఆయన పులివెందుల పులి అయితే.. ఈయన జమ్మలమడుగు సింహం అంటూ భూపేశ్‌రెడ్డి అభిమానులు చెప్పుకొస్తున్నారు.



పేరు	: చదిపిరాళ్ల భూపేశ్ సుబ్బరామిరెడ్డి
భార్య	: జ్యోతి కాటసాని
పిల్లలు	: త్రినయనరెడ్డి, విక్రం ఆదిత్యరెడ్డి
తండ్రి	: చదిపిరాళ్ల నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ
తల్లి	: సరస్వతి
పుట్టిన తేది	: 17 అక్టోబరు 1985
చదువు	: బీఏ ఎల్‌ఎల్‌బీ
రాజకీయ ఎంట్రీ	: 2014 మైలవరం జడ్పీటీసీ
ప్రస్తుతం	: కడప ఎంపీ అభ్యర్థి

నేడు చంద్రబాబు రాక

- ప్రొద్దుటూరులో ప్రజాగళం బహిరంగ సభ

కడప, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు శనివారం ప్రొద్దుటూరులో జరిగే బహిరంగసభలో పాల్గొనను న్నారు. ప్రజాగళం పేరిట చంద్రబాబు రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత పర్యటన చేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం ప్రొద్దుటూరులో నిర్వహించే బహిరంగసభకు హాజరుకానున్నారు. నెల్లూరు జిల్లా పర్యటన ముగించుకుని చంద్రబాబునాయుడు ఉదయం 10.45కు ప్రొద్దుటూరులోని కొర్రపాడు రోడ్డులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరు కుంటారు.

అక్కడ నుంచి రోడ్డుమార్గాన బయల్దేరి 11గంటలకు బహిరంగసభ జరిగే పుట్టపర్తి సర్కిల్‌కు చేరుకుంటారు. 12.30 వరకు బహిరంగసభలో పాల్గొంటారు. 12.45 నుంచి 1.45 వరకు జిల్లా నేతలతో చర్చిస్తారు. అనంతరం 2గంటలకు హెలికాప్టరు ద్వారా తిరుపతి జిల్లాలోని నాయుడుపేట బయల్దేరి వెళతారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై నిఘా : ఎస్పీ కృష్ణారావు


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణారావు

సుండుపల్లె, మార్చి 29: రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహక రించాలని అన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణారావు తెలిపారు. శుక్ర వారం మండలంలోని తిమ్మసము ద్రం, రాయవరం గ్రామ పంచా యతీల్లో స్థానిక ఓటర్లతో సమావే శాన్ని నిర్వహించారు. ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘ టనలు జరగకుండా చూడాలని, అన వసరంగా ఎవరైనా సమస్య లు సృష్టిస్తే వారిపై క్రిమినల్ కేసులు తప్పవన్నారు. సమ స్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. గ్రామాల్లో ఎవరైనా ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే వెంటనే పోలీసు సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటిం చాలని.. అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గతంలో అనేక కేసుల్లో ముద్దాయిలుగా ఉన్న వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పల్లెల్లో సారా తయారీ, విక్రయాలకు పాల్పడితే సమాచారం ఇవ్వాలన్నారు. ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. అనం తరం సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ప్రజల నుంచి ఏవైనా ఫిర్యాదులు వస్తే వెంటనే పరిష్కరించాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. కార్యక్ర మంలో డీఎస్పీ మహబూబ్‌బాషా, సీఐ తులసీరామ్, ఎస్ఐ ఎస్‌కేయం హుస్సేన్, హెడ్‌కానిస్టేబుల్ టీడీ నాయక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


రాయవరంలో సమావేశానికి హాజరైన ప్రజలు

బిల్లులు రాక.. ఆకలి తీరక..!

- వసతి గృహాల్లో విద్యార్థుల ఇక్కట్లు
- నెలల తరబడి బిల్లులు పెండింగ్
- అప్పులు చేసి భోజనం పెడుతున్న వార్డెన్లు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

కార్పొరేట్ పాఠశాలల కంటే మెరుగైన విద్య. వసతి గృహాల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా సేవలు అందిస్తూ.. పేద విద్యార్థుల భవితకు భరోసా కల్పిస్తున్నాం.. అంటూ వైసీపీ ప్రభుత్వం గొప్పగా ప్రచారం చేయడం తప్ప ఆచరణలో పూర్తిగా విఫలమైంది. కనీసం వసతి గృహాల్లో చదువుకుంటున్న పేద విద్యార్థుల ఆకలి కష్టాలను తీర్చలేకపోతుంది. నెలల తరబడి డైట్ చార్జీలు విడుదల చేయలేని దుస్థితిలో ఉంది. దీంతో పిల్లలకు నాణ్యమైన భోజనం అందించేందుకు వార్డెన్లు నానా అవస్థలు పడుతున్నారు. అప్పులు చేసి విద్యార్థులకు భోజనం పెట్టాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


గిరిజన గురుకుల పాఠశాలలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

సుండుపల్లె, మార్చి 29: సుండుపల్లె మండల వ్యాప్తంగా ఒక గిరిజన గురుకులం, బీసీ, ఎస్సీ బాలుర వసతి గృహాలతో పాటు బాలికల వసతి గృహం ఉంది. సాంఘీక సంక్షేమ (ఎస్సీ) వసతి గృహంలో 50 మంది విద్యార్థులు, బీసీ వసతి గృహంలో 50 మంది, జీకే రాచపల్లె విద్యార్థినుల వసతి గృహంలో 70 మంది ఉన్నారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షలు పూర్తి కావడంతో ఇంటికి వెళ్లిపోయారు. ఎస్సీ వసతి గృహానికి అక్టోబరు నుంచి డైట్ చార్జీలు ప్రభుత్వం అందించలేదు. మిగిలిన వసతి గృహాల్లో డిసెంబరు నుంచి బిల్లులు అందించలేదని నిర్వాహకులు వాపోతున్నారు.

చార్జీల చెల్లింపులు ఇలా..

వసతి గృహాల్లో ఉండే మూడు, నాలుగు తరగతి విద్యార్థులకు ఒక్కొక్కరికి డైట్ చార్జీలు (నెలకు) రూ.1000, ఐదు నుంచి పది వరకు చదివే ఒక్కో విద్యార్థికి నెలకు రూ.1250, గిరిజన గురుకుల పాఠశాలలో చదివే వారికి రూ.1450 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తోంది. ఆ సొమ్ముతో ప్రభుత్వం నిర్దేశించిన మెనూను అమలు చేయలేని పరిస్థితి నెలకొందని, అయినా గత ఆరు నెలల నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని నిర్వాహకులు వాపోతున్నారు. దీంతో వసతి గృహాలను నడపలేని పరిస్థితి నెలకొందని వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తే నాణ్యమైన భోజనాన్ని విద్యార్థినీ, విద్యార్థులకు అందించవచ్చని చెబుతున్నారు.

అప్పులు చేసి అన్నం పెడుతున్నాం..

ప్రభుత్వం నుంచి బిల్లులు సకాలంలో రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. అప్పులు చేసి కూరగాయలు, గ్యాస్ మిగిలిన నిత్యావసర సరుకులను తెప్పించి విద్యార్థులకు అన్నం పెడుతున్నాం. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించలేకపోతే తిరుగుబాటు చేస్తున్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలంటే ప్రభుత్వం నుంచి బిల్లులు సక్రమంగా రావడం లేదు. మా జీతాన్ని విద్యార్థుల కోసం వినియోగిస్తే మా కుటుంబ పోషణ ఎలా సాధ్యపడుతుంది. సకాలంలో బిల్లులు చెల్లించాలని వసతి గృహాల నిర్వా హకులు కోరుతున్నారు.

- వసతి గృహాల వార్డెన్లు


భోజనం చేస్తున్న విద్యార్థులు

త్వరలో బిల్లులు వస్తాయి..

ఐదు నెలల నుంచి వసతి గృహ నిర్వాహకులకు బిల్లులు రావాల్సి ఉంది. కొందరికి నేడో రేపో వస్తాయి. ఎప్పటికప్పుడు బిల్లులు వచ్చేలా నివేదికలు ప్రభుత్వానికి పంపిస్తున్నాము. ప్రతి ఒక్కరికి ప్రభుత్వం నుంచి రావాల్సిన డబ్బులు త్వరలో వస్తాయి.

- జాకీర్‌హుస్సేన్, అన్నమయ్య జిల్లా సాంఘీక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్


రాజంపేట: టీడీపీ కార్యాలయంలో సంబరాలు నిర్వహిస్తున్న నేతలు


రైల్వేకోడూరులో జెండాను ఆవిష్కరిస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు


రాయచోటి: మండిపల్లికి కేక్ తినిపిస్తున్న నాయకులు


సుండుపల్లెలో ..


టి.సుండుపల్లెలో..


సిద్ధవటంలో..


వీరబల్లిలో...


చిట్వేలిలో కేక్ కట్ చేస్తున్న నాయకులు


ఓబులవారిపల్లెలో..


నందలూరులో..

టీడీపీతోనే ప్రజా సంక్షేమం

ఘనంగా ఆవిర్భావ దినోత్సవం

రైల్వేకోడూరు, మార్చి 29: టీడీపీతోనే ప్రజా సంక్షేమం జరుగుతుందని టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి తనయుడు యువ నాయకుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రైల్వేకోడూరు పార్టీ కార్యాలయం వద్ద జెండాను ఎగురవేశారు. కార్యకర్తలకు అండగా నిలిచి వారిలో ఉత్సాహం నింపుతున్నామని తెలిపారు. వైసీపీ ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు కొమ్మా శివ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. ఈ రెండు కార్యక్రమాల్లో టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహ ప్రసాద్, సీనియర్ నాయకులు బాబాసాహెబ్, వాసుదేవరెడ్డి, కట్టా బాలాజీ, మలిశెట్టి మురళీధర్‌గౌడు, బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, ముప్పాల రాజశేఖర్‌రాజు, చిగురుపాటి ధనుంజయనాయుడు, దుద్యాల జయచంద్ర, దుద్యాల అనితదీప్తి, కట్టా గుండయ్యనాయుడు, యువ నాయకులు యెలిశెట్టి శంకర్, కొప్పరపు అరవింద్, ఉంగరాల సాయి, నాగినేని వెంకట రమణ, తిమ్మిశెట్టిపల్లె మణి, జి. వెంకటేశ్వర్‌రాజు, దళిత నాయకులు తేనేపల్లి చిన్నా, మహిళా నాయకురాలు బాలు ఇందిరమ్మ, నగిరిపాటి రేవతి, పరిం రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట టౌన్: స్థానిక. టీడీపీ కార్యాలయంలో రాజంపేట పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పార్టీ జెండాను ఎగుర వేసి కేకు కట్ చేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్యనాయుడు, మాజీ మండ లాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాజంపేట టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె: రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి ఇంటి వద్ద యువ నాయకుడు ముక్కా సాయి వికాస్‌రెడ్డి జెండాను ఆవిష్కరించారు. సీనియర్ నాయకులు పున్నాటి వాసుదేవ రెడ్డి, పోలిన శివయ్య నాయుడు, శంకర్ రెడ్డి, గద్దల రేవుపల్లి టీడీపీ నాయకులు శ్రీధర్‌రాజు, సత్యం రాజు, చంద్రారెడ్డి, అడపాల ప్రేమ్‌కుమార్, వేణు గోపాల్‌రెడ్డి, ముక్కావారిపల్లె సర్పంచ్ శ్రీధర్, చిన్న ఓరంపాడు సర్పంచ్ తనయుడు గద్దె పెంచలయ్య, బీసీఆర్ మస్తాన్, వెంకటరమణ యాదవ్, కిరణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. బి.కమ్మపల్లెలో నందమూరి తారకరామారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.మాజీ సర్పంచ్ కోడూరు జనార్దన్‌నాయుడు, మండల చప్పిడి రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సుండుపల్లె: మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ మండల అధ్యక్షుడు రెడ్డెప్ప ఆధ్వర్యంలో జెండా ఎగురవేశారు. సీనియర్ నాయకుడు వెంకటేశ్వర్లునాయుడు, వాణిజ్య విభాగం రాష్ట్ర నాయకులు శివకుమార్‌నాయుడు, ప్రసాద్‌రాజు, మాలేపాటి సురేశ్‌నాయుడు, రమణ, ఎస్సీ నాయకులు చంద్రమౌళి, ఎల్వీ రమణ, రెడ్డినాయక్, రామాంజులు, గ్రామ అధ్యక్షులు సుబ్బరామ్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటం: మండలంలోని భాకరాపేట సమీపంలో మండల టీడీపీ అధ్యక్షుడు శనివారపు మోహన్ రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి దశరథ రామనాయుడు ఆధ్వర్యంలో నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి కాడే శ్రీనివాసులు నాయుడు, పార్లమెంటు ఉపాధ్యక్షుడు పుత్తా రామచంద్రయ్య, బీసీ సెల్ కార్యదర్శి రామ్మోహన్ బీసీ సెల్ అధికార ప్రతినిధి రాజశేఖర్, కార్యకర్తలు, తెలుగుదేశం పార్టీ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

రాయచోటిటౌన్: పేద, బడుగు, బలహీన, అణగారిన, మైనార్టీ వర్గాలకు అండగా తెలుగుదేశం పార్టీ నిలిచిందని రాయచోటి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని సరస్వతివీధి నుంచి ప్రచారం ప్రారంభించారు. చర్చి వీధిలో టీడీపీ జెండాను ఆవిష్కరించి ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులు అర్పించి కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం మాట్లాడుతూ తెలుగు వారి ఆత్మ గౌరవాన్ని కాపాడుకోవడంలో భాగంగా రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి రాయచోటి అసెంబ్లీ స్థానాన్ని, రాజంపేట పార్లమెంట్ స్థానాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మండిపల్లి రాహుల్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ బాషా, మాజీ కౌన్సిలర్ సంజీవరెడ్డి, బేపారి జాఫర్ అలీఖాన్, చిట్టెం రామచంద్ర, ఖాదర్ మోహిద్దీన్, డార్ శీను, జయరాంరెడ్డి, శివారెడ్డి, పీహెచ్ దేవేంధర్‌రెడ్డి, బాల కొండారెడ్డి, కొండారెడ్డి, మదన, గంగిరెడ్డి, కిశోర్, నాగరాజ, నాయుడు, అమీర్, మహబూబ్ బాషా, అర్షద్ తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలుపెద్ద ఎత్తున పాల్గొన్నారు.

చిట్వేలి: కొత్త బస్టాండులోని టీడీపీ కార్యాలయం వద్ద నాయకులు, కార్యకర్తలు కేకును కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అడ్వకేట్ బాలాజీ, అనంత యాదవ్, వైస్ ప్రెసిడెంట్ వెంకటేష్ రాజు, బాలకృష్ణ యాదవ్, శ్రీధర్ నాయుడు, గుండాలయ్య, మైనారిటీ నాయకుడు కరీంబాషా, గూడూరు నాగరాజు పాల్గొన్నారు. సి.కందులవారిపల్లెలో యువ నాయకుడు కాకర్ల నాగార్జున ఆధ్వర్యంలో కేకు కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. బాలు రామాంజనేయులు, మండల మాజీ అధ్యక్షుడు సుబ్బరాయుడు, బాలు రెడ్డయ్య, నరసింహ నాయుడు, సుబ్బరాయుడు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు మహిళలు గ్రామస్థులు పాల్గొన్నారు.

నందలూరు: మండల టీడీపీ అధ్యక్షుడు జంగంశెట్టి సుబ్బయ్య ఆధ్వర్యంలో నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మిఠాయిలు పంచిపెట్టారు.

వీరబల్లి: మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద మండల టీడీపీ అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు, సర్పంచ్ నాగార్జునచారి, పలువురు నాయకులు జెండా ఆవిష్కరించారు. సీనియర్ నాయకులు రాంమోహన్‌రెడ్డి, నాగసుబ్బయ్య నాయుడు, జయచంద్రారెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు ఆంజనేయులురెడ్డి, భాస్కర్‌రాజు, తెలుగు యువత కార్యదర్శి రమేశ్, సిద్దిరాజు, మండల ఉపాధ్యక్షులు దుర్గం ఆంజనేయులు, బీసీ నాయకులు తుమ్మల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సంబేపల్లె: పెద్దజంగంపల్లిలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

పెనగలూరు,: నారాయణ నెల్లూరులో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కె. కళాచంద్ర అధ్యక్షతన జనసేన అభ్యర్థి వై.భాస్కర్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాగతోటి ప్రియాంక, బండెల నవీన్, లింగం బాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఒంటిమిట్ట : మండల కేంద్రంలో నామాల వెంకటయ్య, అడ్వకేటు రామదాసు, ఎం.వి.రమణ, ఎస్.వి. రమణ, మీనిగ రమణ, ఆలూరు వెంకటసుబ్బయ్య తదితరులు ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు.

ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే చర్యలు


వస్త్ర దుకాణంలో తనిఖీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ వాసుబాబు

రాయచోటిటౌన్, మార్చి29: ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ వాసుబాబు హెచ్చరించారు. శుక్రవారం ఆయన పట్టణం లోని వేంపల్లె బైపాస్, చిత్తూరు రింగురోడ్డు వద్ద పలు గోదాములను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నియమావళి అమలులో ఉన్న కారణంగా రూ.50 వేలకు మించి నగదును తీసుకెళ్లకూడదన్నారు. చీరలు, ఇతర వస్తువులు అధిక సంఖ్యలో గోడౌన్లలో నిల్వ ఉంచరాదని, ఒకవేళ పండుగల నిమిత్తం స్టాక్ తెప్పించినప్పటికీ, జీఎస్టీ బిల్స్‌తో పాటు ఇన్వాయిస్‌లు ఉండాలని, లేని పక్షంలో సీజ్ చేస్తామని హెచ్చరించారు. అత్యవసర సమయాల్లో పరిమితికి మించి నగదును తీసుకెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా సంబంధిత అధికారి వద్ద అంగీకారం తీసుకొని సంబంధిత పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. ప్రచార రథాలు, వాహనాలు, ర్యాలీలు, ఇంటింటి ప్రచారాలకు రిటర్నింగ్ అధికారి ముందస్తు అనుమతి తప్పనిసరిగా ఉండాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, ఏఎస్ఐ జోసెఫ్ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక


సుబ్రమణ్యం సమక్షంలో టీడీపీలో చేరిన నాయకులు, కార్యకర్తలు

వీరబల్లి, మార్చి29: మండల పరిధిలోని పెద్దివీడు పంచాయతీ రూకవాండ్లపల్లె, పెద్దివీడు కొత్తపల్లెకు చెందిన తాటిగుట్ల ఈశ్వర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం సమక్షంలో వైసీపీకి చెందిన పలు కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. గత ప్రభుత్వంలో తమకు ఎలాంటి మేలు జరగలేదన్న ఉద్దేశంతో సుగవాసి సుబ్రమణ్యం మీద నమ్మకంతో పార్టీలో చేరామన్నారు. ఆయన గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బొజ్జావారిపల్లెలో జనసేన ప్రచారం


ప్రచారం చేస్తున్న యనమల భాస్కర్‌రావు

రైల్వేకోడూరు, మార్చి 29: మండలంలోని బొజ్జావారిపల్లెలో శుక్రవారం జనసేన పార్టీ అభ్యర్థి యనమల భాస్కర్‌రావు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికులు ఆయనను ఘనంగా సత్కరించారు. గ్లాసు గుర్తు ఓటు వేసి గెలిపించాలని ప్రజల్ని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్య క్షులు కొమ్మా శివ తదితరులు పాల్గొన్నారు.

యనమల భాస్కర్‌రావును గెలిపించుకుందాం

రాయచోటిటౌన్, మార్చి 29: ఉమ్మడి అభ్యర్థి డాక్టర్ యనమల భాస్కర్‌రావును అఖండ మెజార్టీతో గెలిపించుకుందామని భారతీయ జనతా పార్టీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి చీర్ల శ్రీనివాస్‌యాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన రైల్వేకోడూరు నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ యనమల భాస్కర్‌రావును శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ రైల్వేకోడూరు అసెంబ్లీ పరిధిలోని బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేసి భాస్కర్‌రావును అఖండ మెజార్టీతో గెలిపించి రైల్వేకోడూరు అభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాయలసీమ జోనల్ ఇన్‌చార్జి కోసూరి కిరణ్, జిల్లా యువమోర్చా అధ్యక్షుడు వినోద్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే అన్ని వర్గాలకు న్యాయం


వృద్ధురాలిని ఓటు అడుగుతున్న లక్ష్మీప్రసాద్‌రెడ్డి

గాలివీడు, మార్చి 29: రాయచోటి నియోజకవర్గ టీడీపీ అభ్యరి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశాడు. శుక్రవారం మండలంలోని గాలివీడు పంచాయతీ దానంరెడ్డిగారిపల్లె నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వంతోనే అన్ని వర్గాల వారికి న్యాయం జరుగుతుందన్నారు. అనంతరం ఆరు గ్యారెంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లాడు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఉపాధ్యక్షుడు మంద పాటి రవీంద్రబాబు, మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుబు కేడమ్ లక్ష్మయ్య, దానంరెడ్డి గారిపల్లె మాజీ డీలర్ శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు రాయచోటి న్యాయవాదుల సంఘం ఎన్నికలు

రాయచోటిటౌన్, మార్చి 29: రాయచోటి బార్ అసోసియేషన్ ఎన్నికలు శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు నిర్వహించనున్నట్లు న్యాయవాదులు తెలియజేశారు. అసోసియేషన్ అధ్యక్ష పదవికి ఎన్. ప్రభాకర్‌రెడ్డి, కే. రవి శంకర్, కోశాధికారి పదవి కోసం వీ. సిద్దయ్య, ఎం. వెంకట్రమణ పోటీలో ఉన్నారు. మిగిలిన కార్యవర్గ పదవులన్నీ కూడా ఏకగ్రీవమయ్యాయని న్యాయవాదులు తెలియజేశారు. సాయంత్రానికి ఎన్నికల ఫలితాలు వెలువడతాయని వారు తెలియజేశారు.

ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో మామిడి తోటల పరిశీలన


మామిడి తోటలో వంగిమళ్ల రంగారెడ్డి తదితరులు

రామాపురం, మార్చి 29: మూడేళ్లుగా మామిడి తోటలు లాభదాయకంగా లేక పోవడంతో రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి నెలకొందని ఏపీ రైతు సంఘం అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి అన్నారు. మండలంలోని రాచపల్లె, సరస్వతిపల్లెల్లోని మామిడి రైతులతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2021-22లో కరోనాతో ఎక్కడి తోటలు అక్కడ వదిలేశారన్నారు. 2023లో అకాల వర్షాలతో దిగుబడి నేలపాలైందన్నారు. ఈ ఏడాది పూతకాని, పిందె కానీ కనిపించడం లేదన్నారు. ప్రభుత్వం రైతుకు ఇస్తున్న రూ.13,500 ఏ మూలకూ సరిపోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పట్టాభిరెడ్డి, గడ్డం రామాంజుల్‌రెడ్డి, వెంకటమల్లప్పనాయుడు, సుబ్బయ్య, రైతులు పాల్గొన్నారు.

ఇండియా కూటమితోనే విలువలకు రక్షణ: సీపీఐ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నేతలు

రాజంపేట టౌన్, మార్చి29 : దేశంలో, రాష్ట్రంలో అంబేద్కర్ రచించిన రాజ్యాంగం సక్రమంగా అమలు కావాలంటే ఇండియా కూటమిని బలపరచాలని సీపీఐ నేతలు తెలిపారు. శుక్రవారం ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించిన సీపీఐ సమావేశం లో వారు మాట్లాడుతూ ఇండియా కూటమి గెలిపిస్తే భారత సార్వభౌమాధికారాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకున్నవాళ్లమవుతామన్నారు. బీజేపీ, ఇతర పార్టీలకు ఓట్లు వేస్తే తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. బీజేపీ కార్పొరేట్ సంస్థలకు అనుగుణంగా పనిచేస్తుందని, దీంతో నిరుద్యోగ సమస్య అధికమవుతుందన్నారు. గత 70 ఏళ్లుగా ప్రజలు చెల్లించిన పన్నులతో అభివృద్ధి చెందిన రైల్వే, టెలికాం, ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్ రంగానికి కట్టబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు, బీజేపీ నేత, దేశ ప్రధాని నరేంద్రమోదీ ఈ రాష్ట్రానికి ఏం చేశారని వారు ప్రశ్నించారు. రాష్ట్రంలో ఉమ్మడి పార్టీలను తరిమికొట్టాలని వారు పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్. నరసింహులు, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గ నేతలు పి.మహేష్, జ్యోతి చిన్నయ్య, ఎం.ఎస్.రాయుడు, సికిందర్, జి.వి.సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి గడువు పెంపు

లక్కిరెడ్డిపల్లె మార్చి 29: స్థానిక పీఎం మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశానికి ఏప్రిల్ 6వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చుని ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 100, బీసీ, ఓసీ, ఓబిసి విద్యార్థులకు 150 రూపాయలు ఫీజు చెల్లించాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఏపీ మోడల్ స్కూల్‌లో అప్పగించాలన్నారు. రాతపరీక్ష ఏప్రిల్ 21న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటుందని, మెరిట్ ప్రకారం ప్రవేశాలు ఉంటాయన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలు ఆదర్శం


సిబ్బందికి కూలింగ్ అద్దాలు పంపిణీ చేస్తున్న అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి

రాయచోటిటౌన్, మార్చి 29: రాయచోటి లయన్స్ క్లబ్ సేవలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని రాయచోటి అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం క్లబ్ ఆధ్వర్యంలో శ్రీసాయి కంటి ఆసుపత్రి యజమాని శ్రీకాంత్‌రెడ్డి దాతృత్వంలో రాయచోటి అర్బన్ పోలీసులకు కూలింగ్ అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున బ్లూకోర్ట్ పోలీసులకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు కూలింగ్ అద్దాలను అందజేయడం అభినందించదగ్గ విషయమన్నారు. క్లబ్ వ్యవస్థాపకుడు పీఎస్ హరినాథ్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు షేక్ మహమ్మద్, క్లబ్ సభ్యులు నాగార్జునాచారి, కోశాధికారి హరీశ్‌చంద్ర, శివారెడ్డి, రత్నమాచారి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బలగాల కవాతు

నందలూరు, మార్చి29 : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకు కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించామని ప్రజలందరూ స్వేచ్ఛగా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని రాజంపేట రూరల్ సీఐ మంజునాథరెడ్డి తెలిపారు. శుక్రవారం టంగుటూరు, పొత్తపి గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసులు, కేంద్ర బలగాలు పాల్గొన్నారు.

రామాపురం: మండలంలోని కల్పనాయునిచెరువు, సుద్దమళ్ల పంచాయతీలోని యర్రంరెడ్డిగారిపల్లె, బయారెడిగారిపల్లె, నల్లగుట్టపల్లె పంచాయతీలోని కొత్తపల్లి, చిట్లూరు గ్రామాల్లో లక్కిరెడ్డిపల్లె సీఐ గంగాధర్‌బాబు, రామాపురం ఎస్ఐ వీఎల్ ప్రసాద్‌రెడ్డిల ఆధ్వర్యంలో సాయుధ దళాల కవాతు నిర్వహించారు. రామాపురం పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొండ అడవికి నిప్పు

రామాపురం, మార్చి 29: పాలకొండలు అడవికి నిప్పు పెట్టడంతో వన్యప్రాణులకు ముప్పు వాటిల్లుతోందని, పశువులకు మేత లేకుండా పోయిందని పలు గ్రామాల రైతులు, ప్రజలు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని అడవికి నిప్పు అంటించకుండా చూడాలని పలువురు రైతులు, ప్రజలు కోరుతున్నారు.

చేనేత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి


చేనేత కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

ఒంటిమిట్ట, మార్చి 29 : ఆత్మహత్య చేసుకున్న చేనేత కార్మికుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని చేతివృత్తుల సంఘం సమన్వయ కమిటీ కన్వీనర్ భాస్కరయ్య అన్నారు. చేనేత కుటుంబానికి చెందిన సుబ్బా రావు కుటుంబానికి ఒక్కొక్కరికీ 25 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా, వారి భూమి వారికి చెందేలా చర్యలు తీసుకోవాలని పెద్ద కుమార్తె పాల లక్ష్మీప్రసన్నకు ప్రభు త్వ ఉద్యోగం ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల నాయకులతో కలిసి ఆయన శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వీరనాల శివ నారాయణ మాట్లాడుతూ ఆత్మహత్య చేసుకున్న సుబ్బారావు కుటుంబానికి కలెక్టర్ అధ్యక్షతన న్యాయ విచారణ చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పరామర్శించిన బృందంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.నరసయ్య, సహాయ కార్యదర్శి సురేష్‌బాబు, సాంబయ్య పాల్గొన్నారు.

దుద్యాల అభివృద్ధికి ఎమ్మెల్యే అడ్డు ?

● టీడీపీ నేతల ప్రశ్న


విలేకర్లతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

సంబేపల్లె, మార్చి29: దుద్యాల గ్రామ అభివృద్ధికి శిఖండిలా అడ్డు పడుతున్నది మీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి కాదా అని టీడీపీ నాయకుడు దుద్యాల రవీంద్రారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి జేఏసీ కన్వీనర్ వడ్డే వెంకట్ర మణారెడ్డిని ప్రశ్నించారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ పెద్దకోడివాండ్లపల్లె రోడ్డు పనులకు అధికారుల అనుమతించకుండా అడ్డు పడింది ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి కాదా అని ప్రశ్నించారు. మండిపల్లి రాం ప్రసాద్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా ఉన్నప్పుడు రూ. 120 కోట్లు ఎన్ఆర్ ఈజీఎస్ నిధులు దుద్యాల గ్రామానికి మంజూరు చేయించారన్నారు. కొట్టాల హరిజనవాడలకు రోడ్లు మంజూరు అయితే వైసీపీ నాయకుల భూములు పోతాయని అడ్డుకున్నది మీరు కాదా అని ప్రశ్నించారు. దళితుల భూముల్లో రోడ్డు వేసి కొట్టాళ్ల హరిజనవాడకు దారి కల్పించామని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. గ్రామంలో హౌసింగ్ లేఅవుట్‌లో ఎన్ని ఇండ్లు కట్టారో చెప్పాలన్నారు. మండల వైసీపీ జేసీసీ కన్వీనర్, ప్రస్తుత మండల ఉపాధ్యక్షురాలి భర్త ఆంజనేయులు అవెన్యూ ప్లాంటేషన్ చేసి ఒక మొక్క కూడా బతికించలేదన్నారు. మోడల్ స్కూల్ దేవపట్ల, గురుకుల పాఠశాల రాయచోటి, బీసీ హాస్టల్ కాంట్రాక్ట్ పనులు దక్కించుకొని పూర్తి చేయకుండా ఎంతో మంది బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల అసౌకర్యాన్ని కలిగించింది మీరు కాదా అని ప్రశ్నించారు. టీడీపీ అధికారంలోకి రాగానే పనులు పూర్తి చేసి చూపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాజారెడ్డి, సహదేవ, ఆంజనేయులు, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ నాయకులతో హరిప్రసాద్ సంప్రదింపులు


టీడీపీ నాయకులతో సంప్రదిస్తున్న హరిప్రసాద్

ఒంటిమిట్ట, మార్చి 29: రాజంపేట టీడీపీ అభ్యర్థిగా సుగవాసి బాలసుబ్రమ ణ్యంను ప్రకటించడంతో మండలంలోని టీడీపీ నా యకులతో జిల్లా ప్రధాన కా ర్యదర్శి బాలిశెట్టి హరిప్రసా ద్ సంప్రదింపులు నిర్వహించారు. పార్టీ అధిష్ఠానాన్ని గౌరవించాలని ప్రతి కార్యకర్త టీడీపీ అభ్యర్థి విజయం కోసం పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. చంద్రబాబు నాయుడు ఆదేశాలను ప్రతి కార్యకర్త పాటించాలని, సమన్వయంతో మండ లం లోని కార్యకర్తలు అందరూ పనిచేయాలని ఆయన సూచించారు. త్వరలో టీడీపీ అభ్యర్థి బాలసుబ్రమ ణ్యం, ప్రతి కార్యకర్తను కలిసి పార్టీ గెలుపు కోసం కృషి చేస్తారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొత్తపల్లె వెంకటయ్య, బొబ్బిలి రాయుడు, డాక్టర్ శివకుమార్, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థికి సన్మానం

ఒంటిమిట్ట, మార్చి 29: రాజంపేట టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం మండల టీడీపీ సీనియర్ నాయకులు కొమరా వెంకటనరసయ్య ఆధ్వర్యంలో బాలసుబ్రమణ్యంను కలిసి గజమాలతో సత్కరించారు. టీడీపీ పార్టీ అభ్యర్థి విజయం కోసం పనిచేయడం జరుగుతుందని అభ్యర్థిగా ప్రకటించిన చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. రాజంపేటలో టీడీపీ జెండా ఎగురవేస్తుందని రాజంపేట టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం తెలిపారని నాయకులన్నారు. బాలకృష్ణ, వినోద్‌రెడ్డి, ప్రతాప్ రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. జనసేన పార్టీ నాయకులు అతికారి దినేష్, రాజంపేట పార్లమెంటు టీడీపీ కార్యదర్శ సిద్దవటం నాయకులు నాగమునిరెడ్డి, రాజంపేట మార్కెట్‌యార్డ్ మాజీ ఛైర్మన్ ఎద్దల విజయ సాగర్, మాధవరం నాయకులు గంజి సుబ్బరాయుడు, రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కొమరా వెంకటనరసయ్యతో పాటు పలువురు నాయకులు బాలసుబ్రమణ్యంను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. రాజంపేటలో బాలసుబ్రమణ్యం అత్యధిక మెజారిటీతో గెలుపొందుతారని టీడీపీ పార్లమెంటు కార్యదర్శి నాగమునిరెడ్డి ఈ సందర్భంగా తెలిపారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

చిట్వేలి, మార్చి29 : మండలంలోని నగిరిపాడు రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్ర వారం గొల్లపల్లె, తోపురోపల్లె గ్రామ స్థులు చెక్కభజన కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం గొల్లపల్లెకు చెందిన శివయ్య, ప్రమీల కుటుంబ సభ్యులతో అన్నదానం చేశారు. రాత్రి నగిరిపాడు జయరామయ్య, రంగమ్మల జ్ఞాపకార్థం వారి కుమారులు వెంకటసుబ్బయ్య, రాధిక, ప్రవళిక, మౌనిక, నందయ్య, మల్లేశ్వరి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. బాల నాగమ్మ నాటకాన్ని ప్రదర్శించారు.

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే


సెయింట్‌జోసెఫ్ చర్చివద్ద శిలువను మోస్తున్న ఫాదర్ మోహన్‌రెడ్డి

నందలూరు, మార్చి 29 : మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లె ఆర్ఎస్‌రోడ్డులోని సెయింట్ జోసఫ్ క్యాథలిక్ చర్చిలో గుడ్‌ఫ్రైడే సందర్భంగా ప్రార్థనలు చేశారు. విచారణ గురువు ఈరి బాలస్వామి ప్రసంగిస్తూ సర్వలోక పాపపరిహారనార్థం యేసు క్రీస్తు సిలువలో తన ప్రాణం అర్పించాడని వివరించారు. సంఘ పెద్దలు ప్రకాష్‌రెడ్డి, శౌరి, భాస్కర్, జోసఫ్, జైపాల్, నరేంద్ర సంఘ విశ్వాసులు తదితరులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె: మానవాళి కోసం ఏసుప్రభువు శిలువపై ప్రాణత్యాగం చేశాడని సెయింట్ జోషఫ్ కేథలిక్ చర్చి ఫాదర్ విజయమోహన్‌రెడ్డి అన్నారు. .లక్కిరెడ్డిపల్లె, లూథరన్‌చర్చి, మిస్పా, మద్దిరేవుల, దప్పేపల్లె, పందిళ్లపల్లె, చింతకుంటపల్లె చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు, ఫాదర్ విజయకుమార్,ఫాదర్ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు .

రాయచోటిటౌన్: గుడ్‌ఫ్రైడే సందర్భంగా పట్టణంలోని ఎస్ఎన్‌కాలనీలోని సెయింట్ పాల్స్ లూథరన్ చర్చిలో ఫాదర్ మాట్లాడుతూ కల్వరిగిరి మీద ఆయన మరణాన్ని గుర్తు చేసుకుంటూ క్రైస్తవులు గుడ్ ఫ్రైడేని జరుపుకుంటారన్నారు. బైబిల్ ప్రకారం గుడ్ ఫ్రైడే అనేది ఒక విచారకరమైన రోజు. కానీ మానవాళిని పాపాల నుంచి రక్షించడం కోసం ప్రభువైన యేసుక్రీస్తు తన ప్రాణాలను అర్పించిన రోజన్నారు. పాపాల నుంచి విముక్తి కలిగించడం కోసం తనని తాను సంతోషంగా త్యాగం చేసుకున్న రోజున్నారు. అందుకే ఆ రోజును మంచి రోజుగా భావించి గుడ్ ఫ్రైడేగా పిలుస్తారన్నారు.

రైల్వేకోడూరు: మండలం లో శుక్రవారం గుడ్‌ఫ్రైడే సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రముఖులు, రాజకీయ నాయకులు ప్రార్థనల్లో పాల్గొన్నారు.

రాచమల్లుపై జగన్ అసంతృప్తి

● పార్టీలో అందరినీ కలుపుకుని పోలేదంటూ క్లాస్ పీకిన వైనం ● ప్రొద్దుటూరుకు వరాలివ్వలేదని.. జగన్‌పై రాచమల్లు గుర్రు

ప్రొద్దుటూరు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాచమల్లు ప్రసాద్‌రెడ్డిని సీఎం జగన్ మందలించినట్లు విశ్వసనీయ సమాచారం. అధికారంలోకి రావడానికి పార్టీకోసం పనిచేసిన వారిని అందరినీ కలుపుకుని పోవ డంలో విఫలమయ్యాడని క్లాస్ పీకినట్లు పార్టీలోని ముఖ్య నేతలు కొందరు బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. ప్రొద్దు టూరు ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి బస్సుయాత్రలో జగన్ వెంట కూర్చున్నప్పుడు ఈ చర్చ జరిగినట్లు తెలుస్తోంది. రెండు రోజుల క్రితం ప్రొద్దుటూరులో నిర్వహించిన 'మేమంతా సిద్ధం' సభ సందర్భంగా పార్టీలో అసంతృప్తులు బహిర్గతమవడంతో జగన్ ఆయనకు క్లాస్ పీకినట్లు చెబుతున్నారు. అంతేకాకుండా ఇడుపులపాయ నుంచి బస్సుయాత్రలో జగన్ వెంట ఎమ్మెల్సీ రమేశ్ యాదవ్ పాల్గొని ఎర్రగుంట్ల వరకు వచ్చి అక్కడ దిగిపోయి ప్రొద్దుటూరు సభకు రాకపోవడంపై కూడా జగన్ వాకబు చేసినట్లు సమాచారం.





ప్రొద్దుటూరు, మార్చి 29: కొంతకాలంగా ప్రొద్దుటూరులో అసమ్మతి నేతలను కలుపుకోవడం కంటే వారిని ఎలాగైనా పార్టీలో నుంచి బయటికి వెళ్లేలా చేసేందుకు ఎమ్మెల్యే రాచమల్లు పొమ్మనలేక పొగపెట్టాడనే చందంగా వ్యవహరించంపై పార్టీ దృష్టి పెట్టిందని చెబుతున్నారు. ఎమ్మెల్సీ రమేశ్ యాదవ్ తప్ప సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, వైసీపీ మాజీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ వంగనూరు మురలీధర్‌రెడ్డి, పొట్టు లక్ష్మీరెడ్డి, వైసీపీ కౌన్సిలర్లు మహ్మద్‌గౌస్, మునీర్, ఇర్ఫాన్, మాజీ జడ్పీటీసీ వెల్లాల భాస్కర్ ఆయన భార్య పార్టీని వీడటం.. మరికొందరు పార్టీకి దూరంగా ఉండటం జగన్ దృష్టికి వెళ్లినట్లు సమాచారం. అంతేకాకుండా పార్టీపై అసంతృప్తిని బహిరంగంగా వ్యక్తం చేయకుండా.. మాజీ మున్సిపల్ చైర్మన్ ఉండేల గురివిరెడ్డి, జిల్లా రైసు మిల్లుల సంఘం అధ్యక్షుడు కేఎంఆర్ ట్రావెల్స్ అధినేత మునిరెడ్డి మరో వ్యాపారవేత్త శేగిరెడ్డి గంగిరెడ్డి, మాజీ టీటీడీ బోర్డు సభ్యుడు చిప్పగిరి ప్రసాద్, పద్మశాలీయ కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి సైతం ఇటీవల పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. వీరు ఎమ్మెల్యేతో పాటు ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం లేదు. అయితే.. ఇటీవల ఎంపీ అవినాశ్‌రెడ్డి శేగిరెడ్డి గంగిరెడ్డి, కేఎంఆర్ ట్రావెల్స్ అధినేత మునిరెడ్డి ఇంటికివెళ్లి అసంతృప్తులను చల్లార్చే ప్రయత్నం చేశారు. ఐదేళ్ల అధికారంలో ఉన్నా.. పార్టీకోసం పనిచేసిన వారు ఎలా ఉన్నారని ఇక్కడి ఎమ్మెల్యే రాచమల్లు గానీ ఎంపీ అవినాశ్‌గానీ పట్టించుకోకుండా ఎన్నికలప్పుడు వచ్చి మేము మీకు అండగా ఉంటాం అని చెబితే నమ్మలేం అని కొందరు ఖరాఖండిగా చెప్పారని అంటున్నారు. ఇదే విషయం చెప్పి కేఎంఆర్ ట్రావెల్స్ అధినేత వైసీపీని వీడారు. దీంతో ఇటీవలే శేగిరెడ్డి గంగిరెడ్డిని, మాజీ మున్సిపల్ చైర్మన్ గురివిరెడ్డి కుమారుడిని మరికొందరిని జగన్‌తో నేరుగా కలిపించి మాట్లాడించారు. దీంతో వ్యాపారవేత్త శేగిరెడ్డి గంగిరెడ్డి తప్ప మాజీ చైర్మన్ ఉండేల గురివిరెడ్డి మాత్రం ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉన్నారు. ఇటీవల నలుగురు చేనేత కమ్యూనిటీకి చెందిన కౌన్సిలర్లు టీడీపీలోకి వెళ్లగా వారిని బుజ్జగించి మళ్లీ తెచ్చుకోవడం లాంటి విషయాలు కూడా పార్టీ దృష్టిలో ఉన్నాయి. వారం క్రితం ప్రొద్దుటూరు వైసీపీ పట్టణ అధ్యక్షుడు కామిశెట్టి సుబ్రమణ్యం (బాబు) ఆ పార్టీకి రాజీనామా చేశారు. వీటన్నింటితో పాటు రాచమల్లు వ్యవహార శైలిపై జగన్ తీవ్రంగా మండిపడ్డట్టు చెబుతున్నారు. వైసీపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మొట్టమొదటి సభ ప్రొద్దుటూరులో నిర్వహించారు. ఇది ఆ పార్టీకి ఎంతో ప్రాధాన్యం. ఇలాంటి సభలో కూడా వెల్లాల ప్రభాకర్ రెడ్డి ఒక్కడిని తప్ప.. ప్రొద్దుటూరులో ఇతర ప్రముఖులెవరినీ వైసీపీలోకి తీసుకురాలేకపోవడంపై కూడా జగన్ అసహనం వ్యక్తం చేశారని అంటున్నారు.

జగన్‌పై.. రాచమల్లు గుర్రు

ప్రొద్దుటూరులో మొట్టమొదట జిల్లాస్థాయిలో వైసీపీ వారు 'మేమంతా సిద్ధం' సభ నిర్వహించారు. అయితే ఈ ప్రాంత ప్రజలకు ఏమి చేస్తామనేది సభ సాక్షిగా జగన్ వరాల్వక పోవడంపై రాచమల్లు గుర్రుగా ఉన్నట్లు సమాచారం. ప్రొద్దుటూరులో జగన్ రూ.516 కోట్ల పనులకు శిలాఫలకాలు వేయగా అవి వివిధ దశల్లో ఉన్నాయి. ఈ అభివృద్ధి పనుల పై జగన్ కనీసం ప్రస్తావించకపోవడంతో రాచమల్లు కొంత అసంతృప్తిగా ఉన్నట్లు అనుచరులు చెబుతున్నారు. తన సొంతూరిలో సభ ఏర్పాటు చేసి తనకు ప్రసంగించడానికి సమయం ఇవ్వకపోవడం కూడా రాచమల్లులో అసహనం పెంచిందని అంటున్నారు. వచ్చే ఎన్నికల్లో గెలిపిస్తే ప్రొద్దుటూరుకు తాను ఏమి చేయదలిచాడో జగన్ నోట చెప్పించాలని ప్రయత్నించిన రాచమల్లుకు ఆ అవకాశం ఇవ్వకపోవడంతో ఆయన గుర్రుగా ఉన్నట్లు చెబుతున్నారు. దీంతో రాచమల్లు తాను ప్రొద్దుటూరుకు కోరుకున్న వరాలకు సంబంధించిన వినతిపత్రం మాత్రం జగన్ చేతిలో పెట్టారని అంటున్నారు. అందువల్లే ప్రొద్దుటూరు సిద్ధం సభ పెద్దగా ఊపు ఇవ్వలేకపోయిందని తన అనుచరుల వద్ద రాచమల్లు ఆవేదన చెందినట్లు సమాచారం.

సర్వమానవాళి సంతోషంగా ఉండాలి



పెద్దదర్గాకు పూలచాదర్ తీసుకెళ్తున్న ఆర్.శ్రీనివాసరెడ్డి, మాధవీరెడ్డి

కడప (కల్చరల్), మార్చి 29: సర్వమానవాళి కలిసి మెలసి సంతోషంగా ఉండాలని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, కడప నియోజకవర్గ అభ్యర్థి మాధవీరెడ్డి, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్, సానపురెడ్డి రవిశంకర్‌రెడ్డి ఆకాంక్షించారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు షేక్ జిలానీబాషా ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక అమీన్‌పీర్ దర్గా (పెద్ద దర్గా)లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడారు. టీడీపీ నగర అధ్యక్షుడు సానపురెడ్డి శివకొండారెడ్డి, నాయకులు యాటగిరి రాంప్రసాద్, మాసాపేట శివ, చిట్టిబోయిన సుబ్బరాయుడు, శివారెడ్డి, అఫ్సర్‌ఖాన్ తో పాటు పలువురు నాయకులు, అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కల్వారి యాత్ర



కడపలో నిర్వహించిన శిలువ మార్గం కార్యక్రమంలో ఓ దృశ్యం

కడప (కల్చరల్), మార్చి 29: శుభ శుక్రవారం (గుడ్‌ఫ్రైడే) సందర్భంగా నగరంలోని సంధ్య సర్కిల్ వద్ద గల డాన్‌బోస్కో ఐటీఐ నుంచి ఆరోగ్యమాత చర్చి వరకు అలాగే ఆంతోని నగర్ నుంచి మాసాపేట సర్కిల్ మీదుగా చర్చి వరకు 14 ఘట్టాల శిలువ మార్గాన్ని విశ్వాసులు భక్తిశ్రద్ధలతో ప్రదర్శించారు. అనంతరం శిలువపై ఏసుక్రీస్తు పలికిన ఏడు మాటలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మాసాపేట సెయింట్ జాన్ చర్చి విచారణ గురువు ఫాదర్ గుడిమే దేవసహాయం మాట్లాడుతూ నీ కోసం- నీ పాపముల కోసం- నీకు నిత్యం రక్షణ అనుగ్రహించాలని క్రీస్తు ప్రభువు తన ప్రాణాన్ని బలిగా సమర్పించారన్నారు. ఈ కారణం చేతనే మనకు శుభం చేకూరిందని, అందుకే నేడు సకల ప్రజలకు శుభ శుక్రవారంగా పిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఫాదర్లు బాబు, మనోహర్, శాంతి సేవా సొసైటీ వ్యవస్థాపకులు మడగలం ప్రసాద్, పెద్ద సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

తనిఖీల్లో రూ.14 లక్షలు స్వాధీనం

చిట్వేలి, మార్చి29 : చిట్వేలి-రాపూరు ప్రధాన రహదారిలోని రాజుకుంట క్రాస్ రోడ్డు వద్ద ఉన్న పోలీసు చెక్‌పోస్టులో చేపట్టిన తనిఖీల్లో శుక్రవారం మధ్యాహ్నం రూ.14లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు. కోడూరు, రాజంపేట ప్రాంతాల నుంచి ప్రతి శుక్రవారం కొందరు రైతులు, జీవాల వ్యాపారులు మ్యాక్సీల్లో గూడూరు సంతకు జీవాలను తీసుకెళ్లి అమ్ముకుని, అక్కడి నుంచి కొన్ని జీవాలను తెచ్చుకోవడం అలవాటుగా వస్తోంది. ఈ నేపథ్యంలో గూడూరు సంత నుంచి స్వస్థలాలకు తిరిగి వస్తుండగా పోలీసు చెక్‌పోస్టు వద్ద తమ నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారని వ్యాపారులు లబోదిబోమంటున్నారు.

కడపలో రూ.3లక్షలు...

కడప (క్రైం), మార్చి 29: కడప నగరంలోని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని కో-ఆపరేటివ్ కాలనీ సమీపంలో శనివారం ఆకస్మికంగా పోలీసులు తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో ఎఫ్ఎస్‌టీ ఫ్లయింగ్ స్క్వాడ్ వారు షేక్ సమీర్ అనే వ్యక్తి వద్ద నుంచి రూ.3 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఈనగదును తదుపరి చర్యల కోసం ఇన్‌కంట్యాక్స్ వారికి పంపించారు.

35 చీరలు పట్టివేత

కడప నగరం చిన్నచౌకు పోలీసుస్టేషన్ పరిధిలో కారును తనిఖీ చేసి 35 చీరలను స్వాధీనం చేసుకున్నట్లు చిన్నచౌకు పోలీసులు తెలిపారు. ప్రొద్దుటూరు వస్త్రభారతి షాపింగ్ మాల్‌లో దుకాణం నిర్వహిస్తున్న వ్యక్తి మాధవరంలో 31 చీరలు కొనుగోలు చేసి ప్రొద్దుటూరుకు వెళుతుండగా వాహన తనిఖీల్లో చీరలను గుర్తించి సీజ్ చేశారు. వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

67 మద్యం సీసాలు స్వాధీనం



మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్న ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి

పోరుమామిళ్ల, మార్చి 29: ప్రభుత్వ అనుమతి లేకుండా తరలిస్తున్న 67 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అరెస్టు చేశామని ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. శుక్రవారం పోరుమామిళ్లలోని మల్లకతవ చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా కాశినాయన మండలం వంకమర్రి గ్రామానికి చెందిన నరసింహులు అనే వ్యక్తి వద్ద 15 బీరు సీసాలు, కలసపాడు మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన దారం రామక్రిష్ణ వద్ద 52 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. అలాగే ఎలాంటి బిల్లులు లేకుండా రూ.1,01,100 డబ్బులు తీసుకెళుతున్న రాయచోటికి చెందిన రామక్రిష్ణ అనే వ్యక్తి వద్ద నగదును సీజ్ చేశామన్నారు.

మూడు గడ్డివాములు దగ్ధం



ఖాజీపేట మార్చి 29: ప్రమాదవశాత్తు సరాయిపల్లెలో మూడు గడ్డివాములు అగ్నికి ఆహుతి అయ్యాయి. మైదుకూరు మండలం సరాయిపల్లెకు చెందిన బి.సుబ్బారెడ్డి అన్నదమ్ముల గడ్డివాముల్లో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగడంతో గుర్తించిన గ్రామస్థులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. దీంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే 500 కట్టలకుపైగా గడ్డి కాలిపోయిందని వీటి విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడు మృతి



రాజుపాలెం, మార్చి 29 : మండల పరిధిలోని తొండలదిన్నె గ్రామానికి చెందిన నొస్సం బాబుషా (17) అనే యువకుడు శుక్రవారం విద్యుత్‌షాక్‌తో మృతి చెందినట్లు ఎస్‌ఐ తులసి నాగప్రసాద్ తెలిపారు. నొస్సం సంజీవ కౌలుకు భూమి తీసుకుని వరి పంట సాగు చేశాడన్నారు. ఆ పొలానికి సాగునీరు పారించేందుకు ఆయన కుమారుడు బాబుషా అక్కడకి వెళ్లాడని, సాగునీటిని విడిచే సమయంలో ప్రమాదవశాత్తు మోటారుకు విద్యుత్ సరఫరా కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రిఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ముదివేడు దండుమారెమ్మ జాతరకు 20 ఆర్టీసీ బస్సులు

మదనపల్లె అర్బన్, మార్చి 29: ముదివేడులో రెండు రోజుల పాటు నిర్వహించే దండుమారెమ్మ జాతరకు మదనపల్లె నుంచి 20 ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్లు వన్ డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. శనివారం, ఆదివారం ముదివేడులో ఘనంగా నిర్వహించే దండు మారెమ్మ జాతరకు మదనపల్లె వన్ డిపో నుంచి ముదివేడు కోసువారిపల్లె మధ్య ఒక బస్సు శనివారం నుంచి ఆదివారం సాయంత్రం వరకు, కదిరి తేరును పురస్కరించుకుని మదనపల్లె- కదిరికి అదనంగా ఐదు బస్సులు శనివారం నుంచి నడుపుతున్నట్లు మేనేజరు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

● కడపకు చెందిన హరికృష్ణగా పోలీసుల అనుమానం



కల్లూరు, మార్చి29: చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం కల్లూరు పట్టణంలో శుక్రవారం అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ రవిప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం... కల్లూరు నుంచి పులిచెర్లకు వెళ్లే రోడ్డుకు సమీపంలోని పొలంలో శుక్రవారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు కల్లూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ తన సిబ్బందితో చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అతడి వయసు 30 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందన్నారు. మృతుడి తలపై గాయంతోపాటు మృతదేహానికి సమీపంలో రెండు రాళ్లపై రక్తపు మరకలు ఉండటాన్ని గుర్తించిన పోలీసులు హత్య జరిగి ఉండవచ్చన్నారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో కడప జిల్లాకు చెందిన హరికృష్ణగా పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసి మృతదేహానికి శవ పరీక్ష నిమిత్తం పీలేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ కేసును చేధించేందుకు రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని ఎస్‌ఐ తెలి పారు. ఎవరికైనా మృతుడి వివరాలు తెలిసే 9490617887, 9440796721 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ తెలిపారు.

నిబంధనల ఉల్లంఘనపై మాజీ సర్పంచుకు జరిమానా

పీలేరు, మార్చి 29: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న పీలేరు మాజీ సర్పంచ్, వైసీపీ నాయకుడు హబీబ్ బాషాకు రూ.2 వేల జరిమానా విధించినట్లు ఏఆర్‌వో మహబూబ్ బాషా శుక్రవారం తెలిపారు. మార్చి 29వ తేదీ నుంచి ఏప్రిల్ 12వ తేదీ వరకు ఇంటింటి ప్రచారం నిర్వహించుకునేందుకు ముందస్తు అనుమతి తీసుకున్నప్పటికీ, కరపత్రాలు పంచేందుకు అనుమతి తీసుకోకపోవడంతో ఆయన నోటీసు జారీ చేసి, జరిమానా విధించడమే కాకుండా కరపత్రాలు సీజ్ చేసినట్లు వివరించారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారం కోసం 48 గంటలు ముందుగానే అనుమతి తీసుకోవాలని, పీలేరు తహసీల్దారు కార్యాలయంలో నేరుగా గానీ, 'సువిధ' యాప్‌లోగానీ దరఖాస్తు చేసుకోవాలన్నారు.

2న మదనపల్లెకు సీఎం జగన్ రాక

మదనపల్లె, మార్చి 29: మదనపల్లెకు ఏప్రిల్ 2వ తేదీన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రానున్నట్లు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, అన్నమయ్య జిల్లా వైసీపీ అధ్యక్షుడు గడికోట శ్రీకాంత్ రెడ్డిలు తెలిపారు. స్థానిక పుంగనూరురోడ్డులోని ఎంపీ కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశంలో మేమంతా సిద్ధం పేరుతో సీఎం జగన్ చేస్తున్న బస్సుయాత్ర వివరాలను వెల్లడించారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్టు

బి. కొత్తకోట, మార్చి29: బి. కొత్తకోట పట్టణంలో జరిగిన ఓ సంఘటనలో నిందితుడైన జి.రమణ (25)ను శుక్రవారం అరెస్టు చేసి పోక్సోయాక్ట్ కింద కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు సీఐ సూర్యనారాయణ తెలిపారు. నిందితుడిని రంగసముద్రం రోడ్డులోని పాత ఆర్టీసీ డిపో వద్ద అదుపులోకి తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సారా కేసులో వ్యక్తి అరెస్ట్

కలకడ, మార్చి 29: అక్రమంగా సారా కలిగి ఉన్న చలప తినాయక్ అనే వ్యక్తిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. మండ లంలోని ఎగువతాండకు చెందిన చలపతి వద్ద 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

వైసీపీ ప్రచారంలో పాల్గొన్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగి తొలగింపు

ప్రొద్దుటూరు, మార్చి 29: ప్రొద్దుటూరు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాచమల్లుతో పాటు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న జిల్లా ఆసుపత్రి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి, ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్ యు.వెంకటరెడ్డిపై ఎన్నికల అధికారులు వేటువేశారు. ఇటీవల 36 వ వార్డు ప్రచారంలో ఈయన పాల్గొన్నట్లు ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమమైన కథనం ఆధారంగా ఎఫ్ఎస్‌టీ టీం విచారణ చేపట్టింది. వెంకటరెడ్డి ప్రచారంలో పాల్గొన్నట్లు ఈ టీం ఇచ్చిన నివేదిక ఆధారంగా ఎన్నికల అధికారులు ఈయనను విధుల నుంచి తొలగించారు. ఆమేరకు ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్‌కు లెటర్ పెట్టామని ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆనంద్ ఎన్నికల అధికారులకు నివేదిక పంపారు.

ప్రొద్దుటూరు ఎంసీసీ నోడల్ అధికారికి ఆర్వో నోటీసు

ప్రొద్దుటూరు, మార్చి 29: ప్రొద్దుటూరు నియోజకవర్గం పరిధిలో ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్) నోడల్ అధికారి, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డికి ఎన్నికల రిటర్నింగ్ అధికారి కౌసర్‌భాను షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లపై కోడ్ ఉల్లంఘన కేసులు ఎందుకు నమోదు చేయలేదని ఆమె ఆ షోకాజ్ నోటీసులో వివరణ కోరారు. కేవలం ఎన్నికల ప్రచారంలో పాలొన్న వలంటీర్లను విధుల నుంచి తొలగించటం తప్ప వారిపై కోడ్ ఉల్లంఘన కేసు నమోదు చేయకపోవడంపై ప్రశ్నించారు. దీంతో శుక్రవారం ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొని విధులనుంచి తొలగింపునకు గురైన ఏడుగురు వలంటీర్లపై కోడ్ ఉల్లంఘన కేసులు నమోదు చేయమని ఎంసీసీ నోడల్ అధికారి సంబంధిత సచివాలయ అడ్మిన్‌లకు ఆదేశాలిచ్చారు.

ఆ మేరకు వారి పరిధిలోని పోలీసు స్టేషన్లో వలంటీర్లపై ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసు నమోదు చేస్తున్నారు. వలంటీర్లలో గోపిరెడ్డి ధనుంజయ (హరిజనవాడ-2), కాసారపు సుబ్బారావు (కొత్తపల్లి-3), మామిళ్లజ్యోతి (హరిజనవాడ-4), మిద్దేల వసుంధర (హరిజనవాడ-4), మునగాల లిఖిత (హరిజనవాడ-4), మారుపల్లే రామతులసి (హరిజనవాడ-4), ఎస్.అరుణ (వెంకటేశ్వర్ల పేట) సచివాలయాల పరిధిలో వీరిపై కేసు నమోదు చేశారు.

జగన్మోహన్‌రెడ్డి అభివృద్ధి నిరోధకుడు

● కడప పార్లమెంటులో విజయఢంకా మోగిస్తాం ● టీడీపీ ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి



జమ్మలమడుగు, మార్చి 29: రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి అభివృద్ధి నిరోధకుడని, ఆయన పాలనతో జనం విసిగిపోయి ఉన్నారని , కడప పార్లమెంటు పరిధిలో తాము విజయఢంకా మోగిస్తామని టీడీపీ కడప ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కడప పార్లమెంటు పరిధిలో ఏడు నియోజకవర్గాల్లో ఉన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలకు అందరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. ఇప్పటి నుంచి ఏడు నియోజకవర్గాల్లోని నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో కలిసికట్టుగా టీడీపీ అధిష్ఠానం ఇచ్చిన ఆదేశాల ప్రకారం ప్రతి ఒక్కరు సైనికుల్లా పనిచేసి కడపజిల్లా పార్లమెంటుస్థానాన్ని అత్యధిక మెజార్టీతో విజయఢంకా మోగించాలన్నారు. ఆదిశగా ప్రతి ఒక్కరు కలిసి పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. కిందిస్థాయి నుంచి జమ్మలమడుగు నియోజకవర్గంలో టీడీపీని బలోపేతం చేసినందుకు అదిష్ఠానం తనకు కడప పార్లమెంటు అభ్యర్థిగా అవకాశం కల్పించిందన్నారు. జమ్మలమడుగు మండలంలో స్టీల్‌ప్లాంట్ బాధితుల సమస్యలకోసం, నిరుద్యోగుల సమస్యలకోసం పాదయాత్ర చేశానన్నారు. కొండాపురం ముంపు బాధితుల సమస్యలకోసం, పెద్దముడియంలోని రాజోలి బాధిత రైతుల కోసం పాదయాత్ర చేసి బాధితుల సమస్యలను తెలియజేయడం తనకు గుర్తింపునిచ్చిందన్నారు. అందరినీ కలుపుకుని వెళ్లి కడప ఎంపీగా విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు.

వైసీపీ పాలనలో బీసీలకు తీవ్ర అన్యాయం

కల్లూరు, మార్చి 29: వైసీపీ ప్రభుత్వ పాలనలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు రామనాథంనాయుడు, రాష్ట్ర టీడీపీ ఎస్సీ సెల్ విభాగం ప్రధాన కార్యదర్శి ముల్లంగి వెంకటరమణ తెలిపారు. పులిచెర్ల మండలం దేవళంపేట పంచాయతీ కొక్కువారిపల్లెలో శుక్రవారం టీడీపీ జయహో సభ, టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ పాలనలోనే బీసీలు అభివృద్ధి చెందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోవిందయ్య, మల్లెల సురేష్, మహేష్, రమేష్, దేవ, యర్రయ్య, సరస్వతి, గూకంటి నాగరాజు, రమణ, పార్థసారధి, బాబయ్య, నూర్‌భాషా, గౌనూర్ భాషా, ఈఎం రత్నం, సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి ఎన్టీఆర్

రొంపిచెర్ల, మార్చి 29: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి నందమూరి తారకరామారావు అని రాజంపేట పార్లమెంట్ టీడీపీ రైతు సెల్ అధ్యక్షుడు చింతపర్తి ఓబులేశ్వరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఉయ్యాల రమణ అన్నారు. శుక్రవారం రొంపిచెర్లలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూజమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అమరనాధరెడ్డి, మదనమోహన్‌రెడ్డి, రామమూర్తి, సురేంద్ర, రఘు, ఇమ్రాన్, హయత్‌భాషా, తుల సీరాం,ద్వారక, మాధవరెడ్డి, సహదేవ, గౌస్‌పీర్‌ఖాన్, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఎన్ని కుట్రలు పన్నినా టీడీపీ విజయాన్ని ఆపలేరు

రొంపిచెర్ల, మార్చి 29: వైసీపీ నాయకులు ఎన్ని కుట్రలు పన్నినా రానున్న ఎన్నికల్లో టీడీపీ ఘన విజయాన్ని అడ్డుకోలేరని రొంపిచెర్ల మండల బీసీ నాయకులు పురం మల్లయ్య, కరీముల్లా పేర్కొన్నారు. రొంపిచెర్లలో శుక్రవారం బీసీ వర్గం సమావేశం జరిగింది. తెలుగుదేశం పార్టీ హయాంలోనే బీసీలకు గుర్తింపు వచ్చిందని రాజంపేట పార్లమెంట్ బీసీ సెల్ నాయకుడు సుందరం అన్నారు. ముస్లింలకు తగిన ప్రాధాన్యత టీడీపీలోనే వచ్చిందని రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి షేక్ కరీముల్లా అన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు ఉయ్యాలరమణ, మహమ్మదాలి, అబూబకర్, చంద్రగిరి సురేంద్ర, వెంకట్రమణ, నందిమదన, భాస్కర, ఎస్.ఈశ్వరయ్య, హరికృష్ణ పాల్గొన్నారు.

శివాలయంలో డ్రామాలు వద్దు

ఎమ్మెల్యేకు టీడీపీ నాయకుల సూచన

పలమనేరు, మార్చి29 : పలమనేరు కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో సత్య ప్రమాణాల పేరుతో ఇక డ్రామాలు చాలని టీడీపీ నాయకులు ఎమ్మెల్యే వెంకటేగౌడకు సూచించారు. ఎమ్మెల్యే వెంకటేగౌడ 15 శాతం కమీషన్లు తీసుకొన్నారని, శివాలయం భూములు కబ్జా చేశారని, ఇసుక అక్రమంగా బెంగళూరుకు రవాణా చేశారని ప్రజాగళంలో మాజీ మంత్రి అమర్‌నాథ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరోపించిన దాన్ని సవాల్ చేస్తూ శుక్రవారం వెంకటేగౌడ కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ప్రమాణం చేశారు. దీనిపై తెలుగుదేశం పార్టీ నాయకులు మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై సత్యప్రమాణానికి సిద్ధమా అని ఎమ్మెల్యేని ప్రశ్నించారు. ఇకనైనా ఈ సత్యప్రమాణాల డ్రామాను మానుకోవాలన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకలు ఆర్బీసీకుట్టి, గిరిబాబు, మాభాషా, మదన్‌మోహన్, శ్రీనివాసులు, సుబ్బు, సుదాకర్, నదీమ్, రాజేష్, సాధిక్, మురళి, బాలాజి పాల్గొన్నారు.

యుగంధర్‌బాబు దంపతులకు సన్మానం



పలమనేరు, మార్చి29 : జనవిజ్ఞాన వేదిక నాయకులు, సాహితీవేత్త, ఎల్ఐసీ ఉద్యోగి యుగందర్ బాబు దంపతులకు శుక్రవారం పలమనేరులో రచయితల సంఘం శాలువకప్పి, ఘనంగా సన్మానించారు. ఆయన చేసిన సామాజిక, సాహితీ సేవలకుగాను సాహిత్య కళామణి అనే బిరుదును తెలుగు సాహిత్యసాంస్కృతిక సమితి, పలమనేరు రచయితల సంఘం సంయుక్తంగా అందించారు. ఈ కార్యక్రమంలో రచయితలు పలమనేరు బాలాజి, తులసినాథం నాయుడు, ప్రభుత్వ డిగ్రీకళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ రాజేంద్రరెడ్డి, జనవిజ్ఞానవేదిక రాష్ట్రనాయకులు అరుణ్‌శివప్రసాద్, రెడ్డెప్ప, హరేంద్రనాథ్‌శర్మ, రంగనాథం, పలమనేరు రచయితల సంఘం గౌరవాధ్యక్షులు ఆర్.మాధవ్, ఉపాధ్యాయసంఘ నాయకులు జివి.రమణ, సీపీ ప్రకాష్, పలమనేరు ప్రకృతి సంస్థ కన్వీనర్ మల్లిచెట్లదేవేంద్ర, పట్టణ ప్రముఖులు శ్రీపురం సీతారామయ్య, లయన్ నరేంద్ర, ఎంఈఓ వేణుగోపాల్, హెచ్ఎం ఉమామహేశ్వరరెడ్డి, తహసీల్దార్ అమరనాథ్, సాహిత్యసాంస్కృతిక సమితి కార్యదర్శి పుష్ప,జిల్లా సైన్స్ ఉపాధ్యాయులు రమణ, రచయితలు జొన్నవిత్తుల శ్రీరామచంద్ర మూర్తి, జి.శ్రీనివాస, చంద్రశేఖరయ్య, గండికోట వారిజ, బాలకృష్ణమూర్తి, కందుకూరి సుదర్శనాచారి, తదితరులు పాల్గొన్నారు.


రాజంపేట ఎంపీగా కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలి



బైనిగానిపల్లెలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

పుంగనూరు, మార్చి29: రాజంపేట పార్లమెంటు బీజేపీ అభ్యర్థిగా పోటీలో ఉన్న మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపిస్తే జిల్లా అభివృద్ధి జరుగుతుందని రాష్ట్ర బీజేపీ మైనార్టీ మోర్చా నాయకుడు అయూబ్‌ఖాన్ పేర్కొన్నారు. శుక్రవారం పుంగనూరు మండలం రాగానిపల్లె పంచాయతీ బైనిగానిపల్లెలో ఇంటింటా తిరిగి బీజేపీ పేదలకు అందించిన సంక్షేమ పథకాలు ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ అనుభవం కలిగిన వ్యక్తి ఎంపీ అభ్యర్థిగా మనకు రావడం అభినందనీయమన్నారు.

చంద్రబాబుతోనే నవ్యాంధ్ర అభివృద్ధి : చల్లా



కాటిపేరిలో పర్యటిస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

చౌడేపల్లె, మార్చి29: నవ్యాంధ్ర అభివృద్ధి టీడీపీ అధినేత చంద్రబాబుతోనే సాధ్యమని పుంగనూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని కాటిపేరి, ఒడ్డిపల్లె, అగిస్థిగానిపల్లె, కెంగనపల్లె గ్రామాలలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ బీసీలు, మైనార్టీల అభివృద్ధి టీడీపీతోనే అని అన్నారు. దుర్గసముద్రం మాజీ సర్పంచ్ వెంకటరమణకు ఆయన టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో గువ్వల రమేష్‌రెడ్డి, జంపాల శ్రీనివాసులునాయుడు, బీజేపీ నాయకులు గండోడి ప్రవీణ్, జనసేన నాయకులు పురుషోత్తం, గిరిరాజు, కల్యాణ్, బోయకొండ సుబ్బు, హరిప్రసాద్, ప్రభాకర్, మహ్మద్‌గని, అహ్మద్‌ఖాన్, బాబునాయుడు, విజయభాస్కర్‌రెడ్డి, పార్థసారధి, కాటిపేరి భాస్కర్‌నాయుడు, శ్రీనివాసులురెడ్డి, రమణ, వెంగళపల్లె రమణ పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి

గుడుపల్లె, మార్చి 29: టీడీపీతోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని పార్టీ మండలాధ్యక్షుడు బాబునాయుడు పేర్కొన్నారు. శుక్రవారం టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూజలు చేసి, ఆ తరువాత టీడీపీ జెండా ఎగరవేసారు. అనంతరం కేక్ కట్‌చేసి అందరికి పంచి పెట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ. ప్రతి కార్యకర్త వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలన్నారు. 2024లో చంద్రబాబు సీఎం కావడం తథ్యమని, కుప్పం ప్రజలకు మంచి రోజులు వస్తాయని చెప్పారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, హేమాంబర్‌గౌడు, బేటప్పనాయుడు, శ్రీనివాసులు, సుబ్బు, గోపాల్, గోవిందస్వామి, నారాయణ, ఎస్ఆర్ చంద్ర, చంద్రప్ప, రామప్ప, బానుమూర్తి, లక్ష్మీపతి, పాపన్న, ఉదయ్‌కుమార్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కందూరులో బలిపోతుకు పూజలు

సోమల : కందూరులో గంగ జాతరను పురస్కరించుకుని శుక్రవారం బలిపోతుకు పూజలు జరిపారు. పగడాలవారిపల్లె, బాలప్పగారిపల్లెలో బలిపోతును ఊరేగించారు. మార్చి 31, ఏప్రిల్ 1వ తేదీల్లో జాతర నిర్వహణకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చురుగ్గా చేపట్టారు.

ఏసుక్రీస్తు చూపిన మార్గంలో నడవాలి



చర్చిలో ప్రార్థనలు చేస్తున్న పాస్టర్ రాఖేశ్‌నిమ్రోద్, పలమనేరులో శిలువను ప్రదర్శిస్తున్న క్రిస్టియన్లు , రామకుప్పంలో ఏసుక్రీస్తు వేషధారిణి ఊరేగింపు

పుంగనూరు, మార్చి 29: ఏసుక్రీస్తు చూపిన కరుణ, దయ మార్గాల్లో క్రైస్తవులు నడిచి సేవా గుణాన్ని పెంపొందించుకోవాలని పుంగనూరు సీఎస్ఐ చర్చి పాస్టర్ రాఖేశ్‌నిమ్రోద్ సూచించారు. శుక్రవారం స్థానిక చర్చిలో క్రైస్తవులు గుడ్‌ఫ్రైడే జరుపుకొన్నారు. పాస్టర్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు శిలువపై పలికిన ఏడు మాటలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సివుందని పేర్కొన్నారు. ఆదివారం ఈస్టర్ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు.

పలమనేరు : పలమనేరులో శుక్రవారం క్రిస్టియన్లు గుడ్‌ఫ్రైడే పండుగను ఘనంగా జరుపుకొన్నారు. చర్చిల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సెయింట్ లూయిస్ చర్చి సమీపంలో ఏసుక్రీస్తు శిలువ వేయబడిన వైనాన్ని వారు ప్రదర్శన చేశారు.

రామకుప్పం : క్రైస్తవులు స్థానిక చర్చిల్లో సామూహిక ప్రార్థనలు చేశారు. అనంతరం శిలువను ఎత్తుకున్న ఏసుక్రీస్తు వేషధారిని పట్టణ వీధుల్లో ఊరేగించారు. మండలంలోని బల్ల, సింగసముద్రం. 89పెద్దూరు, నారాయణపురంతాండా, వీర్నమల గ్రామాల్లో గుడ్‌ఫ్రైడే జరుపుకొన్నారు.

కల్లూరు : కల్లూరు బీసీ కాలనీలోని చర్చిలో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలు నిర్వహించారు. పాస్టర్ ధన్‌రాజ్ ఆధ్వర్యంలో జీసస్ భక్తి పాటలు, జీసస్ సందేశాలను భక్తులకు వినిపించారు.

సోమల : మండలంలోని క్రైస్తవ మందిరాల్లో గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రార్థనలు జరిపారు. సోమల, నంజంపేట, కందూరు, పెద్దఉప్పరపల్లె లోని చర్చిల్లో భక్తి శ్రద్ధలతో క్రీస్తు శిలువ మోసి చనిపోయిన రోజును గుర్తుకు తెచ్చుకున్నారు.

టీడీపీ ఊపిరి బడుగు బలహీన వర్గాలే..



కుప్పంలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ శ్రేణులు, పలమనేరు టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు

కుప్పం, మార్చి 29: తెలుగుదేశం పార్టీ ఊపిరి బడుగు బలహీన వర్గాలేనని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం, చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి పి.మనోహర్, విస్తరణ కమిటీ చైర్మన్ డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి, భారీ కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం అందిచడమే లక్ష్యంగా ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారన్నారు. అనంతర కాలంలో చంద్రబాబు ఎన్టీఆర్ ఆశయాలను మరింత ముందుకు తీసుకు వెళ్లారని పేర్కొన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో అన్ని వర్గాలు తీవ్ర అణచివేతకు, దాడులు, దౌర్జన్యాలకు గురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని, అప్పుడు అన్ని వర్గాల ప్రజలకు సరైన న్యాయం జరగడమేకాకుండా రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలమనేరు : పలమనేరు టీడీపీ కార్యాలయంలో శుక్రవారం తెలుగుదేశం పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు ఆర్బీసీకుట్టి, నాగరాజు, గిరిబాబు, ఖాజాపీర్, బ్రహ్మయ్య, వెంకటరమణారెడ్డి, సుబ్రమణ్యంగౌడు, కృష్ణమూర్తి, బీఆర్సీకుమార్, మాభాషా, సోమశేఖర్‌గౌడు, నాగరాజ రెడ్డి, జగదీష్‌నాయుడు, అమరనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లె : బైరెడ్డిపల్లెలో శుక్రవారం టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీశ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. రాయల్‌మహల్‌లో టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధానకార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కేక్‌కట్‌చేసి పలువురికి పంచిపెట్టారు.

అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసమే టీడీపీ ఆవిర్భావం

రామకుప్పం, మార్చి 29: అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసమే స్వర్గీయ ఎన్టీయార్ టీడీపీని ఏర్పాటు చేశారని ఆ పార్టీ రామకుప్పం మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ అధ్యక్షుడు ఆంజినేయరెడ్డి, ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పట్రనారాయణచారి తెలిపారు. శుక్రవారం రామకుప్పం టీడీపీ కార్యాలయంలో పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఎన్టీయార్ చిత్రపటానికి పూజలు చేసి, ఘన నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే ధ్యేయంగా ఎన్టీయార్ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని, అదే బాటలో చంద్రబాబు పయనిస్తూ వాటిని మరింత విస్తృతంగా అమలు చేశాన్నారన్నారు. అనంతరం జరిగిన ఎన్డీఏ పక్షాల ముఖ్యనేతల సమావేశంలో పలువురు మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ళ పాలన రాష్ట్రానికి శాపంగా మారిందన్నారు. వైసీపీ సాగించిన నిరంకుశ పాలనలో అన్ని వర్గాల ప్రజలు దగా పడ్డారన్నారు. కుప్పంలో చంద్రబాబును లక్ష మెజారిటీతో గెలిపించేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు కలిసికట్టుగా కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు.



రామకుప్పంలో ఎన్టీయార్‌కు నివాళులర్పిస్తున్న టీడీపీ శ్రేణులు

యువత భవిత టీడీపీతోనే..

రాష్ట్రంలో యువత భవిష్యత్తు టీడీపీతోనే ముడిపడి ఉందని తెలుగు యువత మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం తెలిపారు. శుక్రవారం మండల పరిధి 89పెద్దూరు, కెంచనబల్ల, సింగసముద్రం పంచాయతీల్లో జరిగిన తెలుగు యువత సమావేశాల్లో వారు మాట్లాడతూ వైసీపీ గత ఎన్నికలకు ముందు యువతకు ఎన్నో హామీలిచ్చి, గద్దెనెక్కిన తర్వాత వాటిని తుంగలో తొక్కిందన్నారు. ఏటా జాబ్ కేలండర్ ఇస్తామని యువతకు మోసం చేసిందన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నపుడు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే కాకుండా స్వయం ఉపాధి కోసం వివిధ కార్పోరేషన్ల ద్వారా విరివిగా సబ్సిడీ రుణాలిచ్చిందన్నారు. రాష్ట్రంలో యువత భవిష్యత్తు బాగుండాలంటే తిరిగి టీడీపీ ప్రభుత్వం వస్తేనే అది సాధ్యమవుతుందన్నారు.

కుటుంబ కలహాలతో హోటల్ యజమాని ఆత్మహత్య



బాలగంగాధర్‌తిలక్ (ఫైల్‌ఫొటో)

పుంగనూరు రూరల్, మార్చి 29: కుటుంబ కలహాలతో ఓ హోటల్ యజమాని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం పుంగనూరులో చోటుచేసుకుంది. కుటుంబీకుల కథనం మేరకు ... పుంగనూరు కొత్తపేటకు చెందిన బాలగంగాధర్‌తిలక్‌నాయుడు(56) కొత్తపేట క్రాస్‌లో హోటల్ నిర్వహిస్తున్నాడు. ఇతడికి ఇద్దరు కుమార్తెలు పెద్దకుమార్తె లిఖిత, చిన్న కుమార్తె వినిత ఇద్దరికి వివాహం చేశారు. చిన్న కుమార్తె వినితకు ఏడాది క్రితం సమీప బంధువైన పెద్దపంజాణికి చెందిన జ్యోతిష్‌నాయుడుకు ఇచ్చి వివాహం చేశారు. అయితే జ్యోతిష్‌నాయుడు వైజాక్‌లో బిల్డర్‌గా వ్యవహరిస్తున్నట్లు అత్త, మామ, భార్యను నమ్మించి మోసం చేసినట్లు ఆరోపించారు. ఇటీవల డబ్బు అవసరమని రూ. 30లక్షలు తీసుకున్నప్పటికీ తిరిగి భార్యను ప్రతిరోజు డబ్బు కోసం వేధించడంతో పుట్టినిల్లు చేరింది. కుటుంబంలో గొడవలు జరగడంతో మనస్థాపానికి గురైన బాలగంగాధర్ రాత్రి స్థానిక మార్కెట్‌యార్డులోని ఓ చెట్టుకు తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం కుటుంబసభ్యులు బాలగంగాధర్ ఇంటిలో లేకపోవడంతో చుట్టుపక్కల వెతకడంతో స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబసభ్యులు చేరుకుని పోలీసులకు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని కిందకు దింపారు. ఎస్ఐ సుబ్బారెడ్డి ఘటనాస్థలానికి చేరుకుని మృతిపై ఆరా తీసి మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రామచంద్రయాదవ్‌ను ఆదరించండి

పుంగనూరు, మార్చి 29: ఎన్నికల్లో బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్‌ను ప్రజలు ఆదరించి ఒక్క అవకాశం కల్పించాలని ఆ పార్టీ నాయకులు పుంగనూరులో ఎన్నికల ప్రచారం చేశారు. స్థానిక హనుమంతురాయదిన్నె, రాంనగర్, గాజులవారివీధి, ప్రకాశంకాలనీ, బీడీ కాలనీ, అలగన్నవారివీధి, జోగిండ్లు, అంగడివీధి, కోనేటిపాళ్యం తదితర ప్రాంతాల్లో బీసీవైపీ నాయకులు చెరుకు రైతు గుర్తును బలపరచాలని కోరుతూ ఎన్నికల మ్యానిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో బీసీవైపీ నాయకులు మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ హరినాథరెడ్డి, సాంబమూర్తి, వేణుగోపాల్‌రెడ్డి, కిరణ్, మున్నా, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రలోభాలకు ఆశపడకండి : గౌనివారి

శాంతిపురం, మార్చి 29: ఎన్నికల సమయంలో వైసీపీ అందించే తాయిలాలకు ఆశపడి బిడ్డల జీవితాలు నాశనం చేసుకోవద్దని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క కార్యకర్త 40 రోజులు శ్రమించి చంద్రబాబు కు లక్ష మెజార్టీ తీసుకొచ్చేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నేతలు ఉదయ్ కుమార్, విజయరామిరెడ్డి, ఉయ్యాల జయరామి రెడ్డి, ఆర్ఎస్ మణి, చంద్రశేఖర్, ఎంసీ నాగరాజు, అంజనేయ రెడ్డి, పివి నాగరాజు, అనసూయ, శ్యామల, చంద్రకళ, సుగుణమ్మ, రూప తదితరుల నాయకులు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘనలపై నిఘా పెంచాలి

రామకుప్పం, మార్చి 29: ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై వీఆర్వోలు అప్రమత్తంతో వ్యవహరించాలని తహసీల్దారు శ్రీధర్ ఆదేశించారు. శుక్రవారం తహసీల్దారు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కోడ్ ఉల్లంఘనల సమాచారం తెలిసిన వెంటనే నిజానిజాలు నిర్ధారించుకుని, ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు. తరచూ పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తూ అక్కడ మౌలిక వసతులు మెరుగు కోసం చర్యలు తీసుకోవాలని సూచించారు. డిప్యూటీ తహశీల్దారు దిలిప్‌కుమార్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

వరి పొలాలకు అడవి పందుల బెడద



వరి పొలం చుట్టూ రక్షణగా చీరలు

సోమల, మార్చి 29: వరి పొలాల్లో అడవి పందులు స్వైరవిహారం చేస్తూ రైతుల కంట కన్నీరు తెప్పిస్తున్నాయి. గురువారం రాత్రి సోమల తిరుపతి గంగమ్మ ఆలయం సమీప వరి పొలంలో అడవి పందులు ప్రవేశించి ఎన్ను వస్తున్న పంటలో తిరగాడి నష్టపరిచాయి. పొలం చుట్టూ పాత చీరలు, సౌండ్ సిస్టమ్స్ ఏర్పాటు చేసినా ఫలితం లేకపోతోంది. సోమల, అడుసుపల్లె, ఇరికిపెంట, సూరయ్యగారిపల్లె, నెల్లిమంద, నడిండపల్లె, చిన్నఉప్పరపల్లె తదితర ప్రాంతాల్లో అడవి పందుల బెడద తీవ్రంగా ఉంది. వీటికి తోడు వడ్డిపల్లె, చెన్నయ్యగారిపల్లె, భారతం మిట్ట, కరకమంద ప్రాంత పొలాల్లోకి దుప్పులు వస్తున్నాయని రైతులు తెలిపారు.

సత్యసాయి సేవాసమితి ఆధ్యాత్మిక ప్రచారం

కుప్పం, మార్చి 29: శ్రీసత్యసాయి సేవాసమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మధుసూదన్ ఆధ్వర్యంలో సమితి సభ్యులు శుక్రవారం కుప్పం నియోజకవర్గంలో పర్యటించి ఆధ్యాత్మిక ప్రచారం నిర్వహించారు. ద్రావిడ విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని వినాయకస్వామి ఆలయం వద్ద తాము నాటిన వటవృక్షాన్ని పరిశీలించారు. జేకే.పల్లె భజనమండలి, కుప్పం శాస్త్రివీధిలోని భజనమండలి, సత్యసాయి భజనమండలి సభ్యులకు లిఖితనామ జప పుస్తకాలు అందించి, వాటివల్ల చేకూరే ఆధ్యాత్మికత గురించి వివరించారు. ప్రశాంతి నిలయంలో ఏప్రిల్ 9 నుంచి 20వ తేదీ వరకు జరిగే సేవకు రెండవ బ్యాచ్ సభ్యుల జాబితా పంపాలని సూచించారు. రాళ్లబూదుగూరులో భజన మండలి, సమితి ఏర్పాటు కోసం భక్తులను అంగీకరింప చేశారు.

టీ గ్లాసుల వివాదంతో కత్తితో దాడి

పలమనేరు, మార్చి29 : పలమనేరు ఆర్టీసీ బస్టాండులోని టీ దుకాణం నుంచి తాగిన టీ గ్లాసులు తన క్లినిక్ ఎదుట వేస్తున్నారని శుక్రవారం సాయంత్రం శివశంకర్ అనే ఆర్ఎంపీ టీ దుకాణదారుడిని నిలదీశాడు. దీంతో మాటామాట పెరిగి శివశంకర్ తన వద్ద ఉంచుకున్న కత్తితో టీ దుకాణదారుడు షాజహాన్‌ను పొడవడంతో అతడికి ఛాతిపై గాయమైంది. దీనిపై శివశంకర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పసుపు, కుంకుమ అలంకరణలో విరూపాక్షి మారెమ్మ



పుంగనూరు రూరల్, మార్చి29: పట్టణ నడిబొడ్డున వెలసిన విరూపాక్షి మారెమ్మ శుక్రవారం పసుపు, కుంకుమ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు శ్రీనివాసులు, మురళీలు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. మహిళలు ఉపవాసాలతో అమ్మవారిని దర్శించుకుని చీరలు, రవికలు మొక్కులుగా చెల్లించి తీర్థప్రసాదాలు అందుకున్నారు.

సోమలలో రూ. 1.06 లక్షల నగదు సీజ్

సోమల, మార్చి 29: సోమల-తిరుపతి మార్గంలోని అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద శుక్రవారం బిల్లులు లేకుండా తీసుకు పోతున్న రూ. 1.06 లక్షలు నగదును తనిఖీ అధికారులు సీజ్ చేసినట్లు ఎస్ఐ వెంకట నరసింహులు తెలిపారు. వీలేరు పట్టణం హరినాథ్‌పురానికి చెందిన గౌస్‌పీర్ బొలేరో వాహనంలో ఎలాంటి బిల్లులు లేకుండా రూ. 1.06 లక్షలు నగదును తీసుకొస్తుండగా పోలీసులు నగదును గుర్తించి సీజ్ చేశారు. హెచ్‌సీలు దేవరాజులు, నగేశ్, బాలచంద్ర పాల్గొన్నారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

పలమనేరు, మార్చి29 : డిప్లొమా కోర్సుల ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థినులకు పలమనేరు మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ మొహమ్మద్ తెలిపారు. పాలిసెట్-2024 పరీక్షలకు హాజరయ్యే విద్యార్థినులకు ఏప్రిల్ 1నుంచి 24వ తేది వరకు శిక్షణ ఇచ్చి ఉచితంగా స్టడీ మెటీరియల్స్ అందజేస్తున్నట్లు తెలిపారు. పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు ఏప్రిల్ 5వ తేదీ వరకు గడువు ఉందన్నారు.

పరిసరాల శుభ్రత ముఖ్యం

సోమల, మార్చి 29: ఇంటి పరిసరాల పరిశుభ్రత ముఖ్యమని పెద్దఉప్పరపల్లె వైద్యాధికారి డాక్టర్ బాలాజీ అన్నారు. శుక్రవారం పేటూరు, బోనమంద గ్రామాల్లో వైద్యసిబ్బందితో కలసి పలువురికి ఆరోగ్య పరీక్షలు జరిపారు. వేసవిలో వడ దెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అలాగే సోమలలో సబ్ యూనిట్ అధికారి గంగయ్య, ఎంపీహెచ్‌వో అమరనాథ్ ఆధ్వర్యంలో డ్రై డే ఆవశ్యకతను వివరిస్తూ గ్రామంలో పర్యటించి పలు సూచనలు చేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

గంగవరం, మార్చి 29 : కర్ణాటక నుంచి గంగవరం మీదుగా మద్యం తరలిస్తున్న ఒకరిని అరెస్ట్ చేసి మద్యం సీజ్ చేసినట్లు సీఐ చిన్నగోవిందు తెలిపారు. శుక్రవారం నిందితులను అరెస్ట్ చూపి వివరాలను వెల్లడించారు. పసపత్తూరు క్రాస్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా కురపల్లెకు చెందిన ప్రకాష్‌బాబు ద్విచక్రవాహనంపై వెనుక ఓ ప్లాస్టిక్ సంచెను పెట్టుకొని వస్తుండగా, అనుమానం వచ్చి పరిశీలించారు. ఈ తనిఖీల్లో కర్ణాటకకు చెందిన మూడు కేసుల మద్యం బయటపడింది. దీంతో మద్యం తరలిస్తున్న ప్రకాష్‌బాబును అరెస్ట్ చేసి స్వాధీనం చేసుకున్న మద్యం, ద్విచక్రవాహనాన్ని సీజ్ చేసి కోర్టుకు హాజరుపరచామని సీఐ తెలిపారు.

వ్యాసరాజస్వామి ఆరాధనోత్సవం



బైరెడ్డిపల్లె, మార్చి 29 : తీర్థంగ్రామంలో వున్న రాఘవేంద్రస్వామి ఆలయంలో శుక్రవారం వ్యాసరాజస్వామి ఆరాధనోత్సవాన్ని నిర్వహించారు. అర్చకులు రమేష్ వ్యాసరాజస్వామి చిత్రపటానికి పూజలు చేసి ప్రాకారోత్సవం జరిపారు. గురురాజాసేవాసమితి నిర్వాహకులు మురళీధర్‌రావు, శ్రీనివాసమూర్తి, గురురాజు, మోహన్, ఆనందరావు, వేదవ్యాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు



చౌడేపల్లె, మార్చి29: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు నిర్వహించారు. రాహుకాలంలో అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు రాహుకాల పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. భక్తులకు ఆలయ చైర్మన్ నాగరాజరెడ్డి, ఈవో చంద్రమౌళి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వైష్ణవిదేవికి ప్రత్యేక పూజలు



చౌడేపల్లె, మార్చి29 : పుదిపట్లలో వెలసిన వైష్ణవిదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ నిర్వహకులు వినోద్ కుమార్‌రెడ్డి, శ్రావణిలు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

గాయపడ్డ వ్యక్తి మృతి



చౌడేపల్లె, మార్చి29: ఈనెల 22న రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. చారాల సమీపంలో ఈనెల 22న ఓ వాహనం గుర్తుతెలియని వ్యక్తిని ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ వ్యక్తిని 108 వాహనంలో తిరుపతి రూయా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే 9440900698 నంబరుకు సమాచారం అందించాలని కోరారు.

బగళనత్తంలో శంఖారావం

రామకుప్పం, మార్చి 29: బగళనత్తం గ్రామంలో శుక్రవారం రాత్రి టీడీపీ నాయకులు శంఖారావం కార్యక్రమం నిర్వహించారు. వారు సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. కుప్పం నియోజకవర్గంలో టీడీపీని ఆదరించి, చంద్రబాబును భారీ మెజారిటీతో గెలపించాలని వారు కోరారు. అదేవిధంగా నగినేకుప్పంలో పార్టీ శ్రేణులు శంఖారావం కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో నేతలు ఆనందరెడ్డి, శ్రీనాథరెడ్డి, మునిరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, సోమశేఖర్‌నాయుడు, భాస్కర్, సుబ్రహ్మణ్యం, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచార సామగ్రి ముద్రణకు అనుమతి తప్పనిసరి


ప్రింటింగ్ ప్రెస్ యజమానులతో మాట్లాడుతున్న తహసీల్దారు

పీలేరు, మార్చి 29: సార్వత్రిక ఎన్నికల ప్రచార సామగ్రి ముద్రణకు ముందుగా ఆర్వో అనుమతి, ఆమోదం విధిగా తీసుకోవాలని ప్రింటింగ్ ప్రెస్ యజమానులకు పీలేరు ఏఆర్వో మహబూబ్‌బాషా, ఎంసీపీ అధికారి ఉపేంద్రరెడ్డి ఆదేశించారు. పీలేరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి(ఆర్ వో) ఫర్మాన్ అహ్మద్ ఆదేశాల మేరకు వారు శుక్రవారం పీలేరు పట్టణంలోని ప్రింటింగ్ ప్రెస్ యజమానులకు ఎన్నికల నిబంధనలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాప్రాతినిధ్య చట్టం 127 ఏను అనుసరించి రాజకీయ పార్టీలు తమ అభ్యర్థుల ఎన్నికల ప్రచారానికి వినియోగించే ప్రచార సామగ్రిని ముద్రించుకోవాల్సి ఉంటుందని ఇందు కోసం తమను సంప్రదించే పార్టీల నాయకుల వద్ద ఆర్వో అనుమతి పత్రం ఉందో లేదో చూసుకోవాలన్నారు. సామగ్రి ముద్రించే ముందు ఆర్వో ఆమోదం తీసుకోవాలన్నారు. ముద్రించిన కాపీలపై వాటి సంఖ్య, ముద్రణాలయం చిరునామా విధిగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో డీటీలు ప్రదీప్, సుబ్రహ్మణ్యం, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల ఉల్లంఘనపై మాజీ సర్పంచుకు జరిమానా

పీలేరు, మార్చి 29: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న పీలేరు మాజీ సర్పంచ్, వైసీపీ నాయకుడు హబీబ్ బాషాకు రూ.2 వేల జరిమానా విధించినట్లు ఏఆర్వో మహబూబ్ బాషా శుక్రవారం తెలిపారు. మార్చి 29వ తేదీ నుంచి ఏప్రిల్ 12వ తేదీ వరకు ఇంటింటి ప్రచారం నిర్వహించుకునేందుకు ముందస్తు అనుమతి తీసుకున్నప్పటికీ, కరపత్రాలు పంచేందుకు అనుమతి తీసుకోకపోవడంతో ఆయన నోటీసు జారీ చేసి, జరిమానా విధించడమే కాకుండా కరపత్రాలు సీజ్ చేసినట్లు వివరించారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారం కోసం 48 గంటలు ముందుగానే అనుమతి తీసుకోవాలని, పీలేరు తహసీల్దారు కార్యాలయంలో నేరుగా గానీ, 'సువిధ' యాప్‌లోగానీ దరఖాస్తు చేసుకోవాలన్నారు.

600 మంది పోలింగ్ సిబ్బంది శిక్షణకు ఏర్పాట్లు


పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేయిస్తున్న ఏఆర్వో రమాదేవి

మదనపల్లె టౌన్, మార్చి 29: మదనపల్లె నియోజకవర్గంలో 259 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు సజావుగా నిర్వహించడానికి అవసరమైన 600 మంది పీవోలు, ఏపీవోలకు, పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు ఏఆర్వో రమాదేవి ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం స్థానిక బీటీ కళాశాలలో ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రెండు విడతలుగా ఇచ్చే ఈ శిక్షణ లో ఈవీఎంల నిర్వహణ, వీవీప్యాట్, ఓటరు వెరిఫి కేషన్, తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల పాల్గొన్నారు.

2న మదనపల్లెకు సీఎం జగన్ రాక

మదనపల్లె, మార్చి 29: మదనపల్లెకు ఏప్రిల్ 2వ తేదీన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రానున్నట్లు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా వైసీపీ అధ్యక్షుడు గడికోట శ్రీకాంత్ రెడ్డిలు తెలిపారు. స్థానిక పుంగనూరురోడ్డులోని ఎంపీ కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశంలో మేమంతా సిద్ధం పేరుతో సీఎం జగన్ చేస్తున్న బస్సుయాత్ర వివరాలను వెల్లడించారు. శ్రీసత్యసాయి పుట్టపర్తి జిల్లా కదిరి నుంచి ఏప్రిల్ ఒకటోతేదీన బస్సు యాత్ర ములకలచెరువు సమీపానికి చేరుకుని రాత్రి అక్కడే బస చేసిన సీఎం రెండో తేదీ .తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు మీదుగా మదనపల్లెకు చేరుకుంటారన్నారు.

ముదివేడు దండుమారెమ్మ జాతరకు 20 ఆర్టీసీ బస్సులు

మదనపల్లె అర్బన్, మార్చి 29: ముదివేడులో రెండు రోజుల పాటు నిర్వహించే దండుమారెమ్మ జాతరకు మదనపల్లె నుంచి 20 ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్లు వన్ డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. శనివారం, ఆదివారం ముదివేడులో ఘనంగా నిర్వహించే దండు మారెమ్మ జాతరకు మదనపల్లె వన్ డిపో నుంచి ముదివేడు కోసువారిపల్లె మధ్య ఒక బస్సు శనివారం నుంచి ఆదివారం సాయంత్రం వరకు, కదిరి తేరును పురస్కరించుకుని మదనపల్లె-కదిరికి అదనంగా ఐదు బస్సులు శనివారం నుంచి నడుపుతున్నట్లు మేనేజరు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సామాజిక చైతన్యానికి స్ఫూర్తి టీడీపీ

● టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పార్టీశ్రేణులు, ఎమ్మెల్యే అభ్యర్థులు ● పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌కు ఘననివాళి ● సామాజిక విప్లవానికి నాంది అంటూ సంబరాలు


మదనపల్లెలో టీడీపీ జెండా ఎగురవేస్తున్న ఉమ్మడి కూటమి అభ్యర్థి షాజహాన్‌బాషా


పెద్దమండ్యం టీడీపీ ఆవిర్భావ దినోత్సవంలో నాయకులు


కలకడలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు


గుర్రంకొండ పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

మదనపల్లె టౌన్, మార్చి 29: తెలుగు రాష్ట్రాల్లో సామాజిక విప్లవానికి నాంది పలికి సామాన్యుడికి కూడా రాజకీయం అందుబాటులోకి తెచ్చిన ఘనత టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావుదే అని మదనపల్లె టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి షాజహాన్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక దేవతానగర్‌లోని టీడీపీ పార్లమెంట్ కార్యాలయం, సుభాష్‌రోడ్డులోని షాజహాన్‌బాషా నివాసం వద్ద పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా టీడీపీ జెండాలు ఎగురవేసి ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాలు అన్ని విధాల అభి వృద్ధి చెందేందుకు ఆనాడు ఎన్టీఆర్ పాలన సాగిస్తే, చంద్రబాబు ఆనాటి ఆశయాలను నేడు రాష్ట్ర ప్రజలకు అందించాడన్నారు. టీడీపీ సైకిల్ గుర్తుకు ఓట్లు వేయించి, మళ్లీ చంద్రబాబును సీఎం చేయాలని షాజహాన్‌బాషా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రఫి, విద్యాసాగర్, ఆర్‌జే వెంకటేశ్, సిద్దప్ప, ప్రసాద్, వేణు గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కురబలకోటలో: టీడీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ శక్తి వంచన లేకుండా కృషి చేయాలని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మం డలంలోని కురబలకోట, అంగళ్లు, చేనేతనగర్ తదితర గ్రామాల్లో టీడీపీ 42వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి పార్టీజెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు సీడ్ మల్లికార్జుననాయుడు, రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్. బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి త్యాగరాజు, పార్లమెంటరీ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి అయూబ్ బాషా, మాజీ జడ్పీటీసీ కువైట్ శంకర్, మాజీ ఎంపీపీలు తిమ్మరాయుడు, మండల కన్వీనర్ సురేంద్ర, మాజీ సర్పంచ్ రమణ, వెంకటరమణారెడ్డి, జంగా రాఘవరెడ్డి, మోహన్‌రెడ్డి, సదాశివ, భాస్కర్, శివారెడ్డి, శంకర్‌రెడ్డి, విశ్వనాథ, వల్లీ పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో: పెద్దమండ్యంలో శుక్రవారం మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన నాయకులు టీడీపీ 42వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూజలు నిర్వహించి కేక్ కట్ చేశారు. టీడీపీ జండాను ఆవిష్కరించారు. పెద్దమండ్యం మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు సిద్ధవరం ప్రసాద్ బి. నాగేశ్వరరెడ్డి, హసీంసాబ్, రామాంజులు నాయుడు, శంకర్‌రెడ్డి, గంగాధర, దత్తాత్రేయరెడ్డి, ప్రభాకరరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, సాంబ, మోహన, సయ్యద్‌షావలి, నారా శ్రీనివాసులు, మహేశ్వర, సాంబశివ, చలపతినాయుడు, శేషాద్రి, రాజు, మస్తాన్ పాల్గొన్నారు.

పీలేరులో: తెలుగుదేశం పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం పీలేరులో ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. తిరుపతి రోడ్డులోని పార్టీ కార్యాలయంలో పార్టీ జెండాను ఆవిష్కరించడమే కాకుండా వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఎన్టీఆర్ టీడీపీ స్థాపించిన తరువాతనే రాష్ట్రంలోని పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలకు హక్కులు ఏర్పడ్డాయని, మహిళలకు ఆస్తిలో హక్కు కలిగిందని గుర్తు చేసుకున్నారు. ప్రభుత్వ వ్యవహారాలను ఎన్టీఆర్ సామాన్యుల ముంగిట్లోకి తెచ్చారన్నారు. అదే స్ఫూర్తిని చంద్రబాబునాయుడు కొన సాగించారన్నారు. ఎన్నికల్లో పార్టీని అధికారం లోకి తెచ్చే వరకు విశ్రమించకూడదని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

గుర్రంకొండలో: తెలుగుదేశం పార్టీ ఆవిర్భవ దినోత్సవాన్ని గుర్రంకొండలో శుక్రవారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహిం చారు. ఇందులో భాగంగా పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు జగదీష్‌కుమార్, నౌషాద్‌అహ్మద్, చలమారెడ్డి, ఏజా జ్‌అహ్మద్, రమణ, చిన్నప్ప, శ్రీన, బయ్యారెడ్డి, మురళీ, సుధాకర్, వెంకటరమణ, తారక, రామయ్య, సుబ్బరాజు, బ్రహ్మయ్య, ఆబిద్ పాల్గొన్నారు.

కలకడలో: తెలుగుదేశం పార్టీ ఆవిర్భవ దినోత్సవాన్ని శుక్రవారం కలకడలో ఆపార్టీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పించి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జుననాయుడు, బీవీస్వామి, రైస్‌మిల్ రమణ, ఈశ్వరయ్య, శేఖర్‌నాయుడు, తారకేశ్వర, ఆనంద్‌రెడ్డి, త్యాగరాజు, ప్రసాద్‌నాయుడు, రామాంజులు, బీవీనాయుడు, వసంత నాయుడు, వెంకటరమణ, సారథి, గురుపాదం, భాస్కర్‌నాయుడు, ఎల్లయ్య, మునాఫ్, జిలానీ, ఖాజా, అలీ, ఇమ్రాన్ పాల్గొన్నారు.

నిమ్మనపల్లిలో: టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రాన్ని రామరాజ్యంగా మారుస్తామని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి షాజహాన్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బస్టాండులో టీడీపీ 42వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం టీడీపీ కార్యకర్తలను కేసులతో బయపెట్టి వారిని బయటకు రాకుండా పోలీసులతో రాజ్యాన్ని నడుతున్నారని ఆరోపించారు. దివంగత నేత ఎన్టీఆర్ ఆశయాలను ముందకు తీసుకెళ్లాలంటే టీడీపీ అధికారంలోకి రావాలన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించుకోవా లన్నారు. అనంతరం టీడీపీ జెండాను ఎగురువేసీ ఎన్‌టీఆర్ చిత్ర పటనికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజన్న, రమణ, శ్రీపతి, రెడ్డెప్ప, రామకృష్ణ, జయన్న, రెడ్డెప్పరెడ్డి, మల్లికార్జున పాల్గొన్నారు.

రామసముద్రంలో: మండల కేంద్రంలో టీడీపీ 42వ ఆవిర్భావ దినో త్సవ వేడుకలను పార్టీ అధ్యక్షుడు విజయకుమార్‌గౌడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నందమూరి తారక రామా రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు పంచిపె ట్టారు. అనంతరం విజయకుమార్‌గౌడు మాట్లాడుతూ ఎన్నికల్లో ఎ మ్మెల్యే అభ్యర్థి షాజహాన్‌బాషాను, ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈకార్యక్రమంలో మదనపల్లె బాబురెడ్డి, విష్ణువర్దన్‌రెడ్డి, ప్రదీప్‌గౌడు, బీజేపీ కృష్ణమూర్తి, మునివెంకటస్వామి, సుధాకర్‌రెడ్డి, శివశంకర్, చెంగారెడ్డి, బండ్లజన శంకర్‌రెడ్డి, మిట్టపల్లి నాగరాజు, టేకపల్లె రమణ, శ్రీనివాసరాజు, జయకుమార్, నడింపల్లె రమేష్ పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: వాల్మీకిపురం మండల వ్యాప్తంగా శుక్రవారం టీడీపీ 42వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. వాల్మీ కిపురం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అలాగే మండలంలోని చింతపర్తి గ్రామంలో సర్పంచ్ మహిత శేషాద్రిరెడ్డి ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ చిత్రప టానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిరు పేదలకు వితరణ కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమాలలో మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, నాయకులు వీవీ నారాయణ, రాజేం ద్రాచారి, గాంధీపేట రమణ, వల్లిగట్ల వెంకటరమణ, సురేంద్రవర్మ, పీలేరు మైనార్టీ అధ్యక్షులు సయ్యద్‌బాషా, కోసూరి చంద్రమౌళి, కువైట్ సయ్యద్‌బాషా, చాను, యూసుఫ్, సుధాకర్‌రెడ్డి, స్వర్ణలత, న్యాయవాది రమణ, టీస్టాల్ సయ్యద్, హనీఫ్, బొక్కసం బ్రదర్స్ పాల్గొన్నారు.

కలికిరిలో: కలికిరి మండల కేంద్రంలోని అమరనాథరెడ్డి భవన్‌లో టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భవన్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధానంగా బీసీలను, యువతను రాజకీ యంగా ప్రోత్సహించిన పార్టీ టీడీపీ ఒక్కటేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు నిజాముద్దీన్, ఆ పార్టీ నాయకులు చంద్రశేఖర్, రహంతుల్లా, మాలతి, అంజమ్మ, జ్ఞానమూర్తి, వేణు, జనార్ధన, వెంకటపతి, ముస్తఫా, జనసేన అస్లామ్, మున్వర్, షబ్బీర్, గోవర్ధన్, యతీంద్ర, రమణ, చిన్నరెడ్డెయ్య, శ్రీనివాసులు, మునాఫ్, సనావుల్లా, జాఫర్, షఫీ, ఏసురాజు, షావల్లి, రాజేష్, పుర్రు రెడ్డిశేఖర్, భాస్కర, కాదర్‌వల్లీ పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో: మండల కేంద్రమైన పీటీఎంలో శుక్రవారం టీడీపీ 42వ ఆవిర్భావ దినోత్సవాన్ని టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పీటీఎం మండల టీడీపీ అధ్యక్షుడు ఆనంద్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఎగురవేసి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆనంద్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో టీడీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సింగల్ విండో మాజీ ఛైర్మన్ సంపతికోట కిట్టన్న, సీనియర్ నేత కట్టా సురేంద్ర నాయుడు, గ్రామ కమిటీ అధ్యక్షుడు కత్తి ఆదినా రాయణ, మాజీ ఎంపీటీసీ చిన్నా, మాజీ సర్పంచ్ ఆంజనేయులు, పాలగిరి రామాంజులు, జనసేన నాయకులు ముద్దసాని నాగరాజు, బీజేపీ నాయకులు మల్లెం శివయ్య, మస్తాన్, రెడ్డిబాషా పాల్గొన్నారు.

ములకలచెరువులో: తెలుగుదేశం పార్టీ బడుగు బలహీన వర్గాల కోసం ఆవిర్భవించిందని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక బస్టాండు సర్కిల్‌లో శుక్రవారం టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా ఉమ్మడి అభ్యర్థి జయచంద్రారెడ్డి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగిస్తూ టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పార్టీ ప్రతిష్ఠతను ప్రపంచ వ్యాప్త చేశానరన్నారు. ఈ కార్యక్రమలో టీఎస్ఎన్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కట్టా దొర స్వామినాయుడు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోతుల సాయి నాథ్, మండల టీడీపీ అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, మాజీ జడ్పీటీసీ సభ్యుడు కువైట్ శంకర్, బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు చెన్నకిష్టా, నేతలు కేవీ రమణ, కేశవులు, యర్రగుడి సురేష్, నాయకులు నాగేంద్ర, బయన్న, రమణారెడ్డి పాల్గొన్నారు.

బి. కొత్తకోటలో: తెలుగుదేశం పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవాన్ని బి కొత్తకోట జ్యోతి చౌక్‌లో ఆ పార్టీ నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ వ్యవస్థాపకుడు ఎన్‌టి రామారావు చిత్రటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ పతాకాన్ని ఎగురవేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్ మాట్లాడుతూ తెలుగువాడి ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన పార్టీ టీడీపీ అన్నారు. కార్యక్రమంలో నాయకులు నారాయణస్వామి రెడ్డి, కుడుం శ్రీనివాసులు, డి.నారాయణ చావిడికిట్టన్న, యండీ మస్తాన్, కనకంటి ప్రసాద్, సుకుమార్, చాకనారాజా, గంజిమోహన, పద్మనాభ పాల్గొన్నారు.


పీలేరులో టీడీపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్న పార్టీ శ్రేణులు


వాల్మీకిపురంలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు


రామసముద్రం, నిమ్మనపల్లెల్లో టీడీపీ ఆవిర్భావ వేడుకలు


కలికిరిలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ శ్రేణులు


బి. కొత్తకోటలో ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు


ములకలచెరువులో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నేతలు


పీటీఎంలో ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే వేడుకలు

పీలేరు, మార్చి 29: ఏసుక్రీస్తు పునరుత్థానం పొందిన సందర్భంగా జరుపుకునే గుడ్ ఫ్రైడే పండుగను పీలేరు మండలంలోని క్రైస్తవులు శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని అన్ని ప్రార్థనా మందిరాలు, చర్చిల్లో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. స్థానిక చిత్తూరు మార్గంలోని షెకీనా ప్రార్థనా మందిరంలో పాస్టర్ డేనియల్ ధార్మికోపన్యాసం చేస్తూ అనేక కష్టాలు కలిగించినా, సజీవంగా శిలువ వేసినా ఏసుక్రీస్తు ఎవరినీ ద్వేషించలేదన్నారు. ప్రస్తుత తరుణంలో మానవాళి ప్రశాంత జీవనం సాగించాలంటే ఆయన బోధించిన మార్గమే ఆచరణీయమన్నారు.

మదనపల్లె అర్బన్: గుడ్‌ఫ్రైడేను శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆయా చర్చిల్లో ప్రత్యేక ఆరాధనలు చేశారు. లోకరక్షకు ఏసు పలికిన ఏడు వాక్యాలను పాస్టర్లు ఉపదేశించారు. స్థానిక జేసీఎం చర్చి డివిజనల్ పాస్టర్ రెవ డాక్టర్ సునీల్ వరకుమార్ మానవాలి శాంతి కోసం రక్తం చిందించిన ఏసుక్రీస్తు ప్రేమకు గుడ్‌ఫ్రైడే ప్రతీక అన్నారు. డేవిడ్ సంజయ్ కొరియర్ బృందం ఆలాపించిన భక్తిగీతాలు ఆకట్టుకున్నాయి. వచ్చిన భక్తులకు శీతల పానీయాలు అందజేశారు. కార్యక్రమంలో జేసీఎం చర్చి కార్యదర్శి భక్తవత్సలం, కోశాధికారి ఆనందకుమార్ ,కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఆరోగ్యవరం మెడికల్ సెంటర్‌లోని చర్చిలో, ఆరోగ్యవరం సెయింట్ లూక్స్ చర్చిలో ఘనంగా గుడ్‌ఫ్రైడే నిర్వహించారు.

కలకడలో: మండలంలో గుడ్ ఫ్రైడే పర్వదినాన్ని శుక్రవారం క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా కోన గంగిరెడ్డిగారిపల్లెలోని యిబ్రోన్‌ప్రార్థన మందిరం, కల కడ షపర్డ్ చర్చిలో పాస్టర్‌లు విజయశేఖర్, సుబాష్‌ల ఆధ్వ ర్యంలో ప్రార్థనలు చేశారు. అలాగే ఉదయం నుంచి మధ్యా హ్నం వరకు ఉపవాస దీక్ష చేశారు. అనంతరం ఆరాదన కార్యక్రమం నిర్వహించి అన్నదానం చేశారు.

కురబలకోటలో: మనిషి తన దైనందిత జీవితంలో పరోపకారమే పరమావధిగా జీవితాన్ని కొనసాగించాలని పాస్టర్ ప్రకాశం పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అంగళ్లు సియోను ప్రార్థనా మందిరం, తెట్టు, కామూరి వాండ్లపల్లె, ఆరోగ్యపురం తదితర చోట్ల చర్చిలలో గుడ్ ఫ్రైడే పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తు త సమాజంలో స్వార్థం, అహింసలు పెరుగుతున్నాయని, ప్రతి ఒక్కరు వాటిని విడిచి సన్మార్గంలో పయనించాలన్నారు. అనంతరం ప్రపంచ శాంతి కోసం ప్రార్థనలు చేశారు.

బీసీల రక్షణ, అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

● కూటమి అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డి


తంబళ్లపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న కూటమి అభ్యర్థి జయచంద్రారెడ్డి, నాయకులు

తంబళ్లపల్లె మార్చి 29 : రాష్ట్రంలో బీసీల రక్షణ, అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం తంబళ్లపల్లె మండల కేంద్రంలో జయహో బీసీ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జయచంద్రారెడ్డి మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో బీసీల సంక్షేమం కోసం కార్పొరేషన్‌తో పాటు రుణాలు, చేతి వృత్తుల పరికారాలు, చంద్రన్న బీమా, విద్యార్థులకు గురుకుల స్థాయి విద్య, విదేశీ విద్య, ఇలా 30 రకాల పథకాలు అమలు చేసిందన్నారు. అయితే ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం పలు పథకాలను రద్దు చేయడంతో పాటుబీసీల రాజకీయ రిజర్వేషన్లను హరించిందన్నారు. రానున్న ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే బీసీలకు రక్షణ చట్టం, 50 ఏళ్లకే పెన్షన్‌తో పాటు రద్దు చేసిన పథకాలను తిరిగి పునరుద్ధరిస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేసి సీఎంగా చంద్ర బాబు నాయుడుని, ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే బీసీల సంక్షేమానికి కట్టుబడి ఉంటామని హామీ ఇచ్చారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్, తంబళ్లపల్లె పరిశీలకుడు సీడ్ మల్లిఖార్జున నాయుడు, పలువురు బీసీ నాయకులు వైసీపీ ప్రభుత్వంలో బీసీలకు జరిగిన అన్యాయాన్ని ఎండగట్టారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి నాయుడు,డెరంగుల చంద్ర, మాజీ జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుడు రామచంద్ర, చలపతి నాయుడు, సోమశేఖర్, తెలుగు యువత నరసింహులు, బిఎంఆర్, సుబ్రమణ్యం, జగదీష్, రెడ్డెప్ప, జనసేన మురళి, హరీష్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం



మదనపల్లె అర్బన్. మార్చి29: మదనపల్లె బార్ అసోసియే షన్ అధ్యక్షుడుగా ఎన్నికైన తొట్టి వెంకటరమణారెడ్డిని శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మదనపల్లె నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్ రెడ్డిసాహెబ్, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షు రాలు, మాజీ కౌన్సిలర్ మీనాకుమారి, జిల్లా ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు రవీంద్ర, మహబూబ్‌పీర్, సమీర్, మహ్మద్ అలీసమీ, తదతరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్టు

బి. కొత్తకోట, మార్చి29: బి. కొత్తకోట పట్టణంలో జరిగిన ఓ సంఘటనలో నిందితుడైన జి.రమణ (25)ను శుక్రవారం అరెస్టు చేసి పోక్సోయాక్ట్ కింద కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు సీఐ సూర్యనారాయణ తెలిపారు. నిందితుడిని రంగసముద్రం రోడ్డులోని పాత ఆర్టీసీ డిపో వద్ద అదుపులోకి తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సారా కేసులో వ్యక్తి అరెస్ట్

కలకడ, మార్చి 29: అక్రమంగా సారా కలిగి ఉన్న చలప తినాయక్ అనే వ్యక్తిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. మండలంలోని ఎగువతాండకు చెందిన చలపతి వద్ద 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.